8367

రసార్ణవసుధాకరము—చమత్కారచంద్రిక.

వ్యాకరణవిద్యాప్రవీణ-విద్వాన్, చిలుకూరి పాపయ్యశాస్త్రి.

సంస్కృతమున 'రసార్ణవసుధాకర'మను మూఁడు విలాసములు గల యీ యలంకారగ్రంథమును రచియించిన కవివరేణ్యుఁడు- ఆంధ్రమండలాధీశ్వరుఁడు, సర్వజ్ఞచూడామణియు నగు సింగభూపాలుఁడు. ఎనిమిది విలాసములతో విలసిల్లి, సరససాహిత్యచాతురీధురీణత నెల్లెడల వెదచల్లు 'చమత్కారచంద్రిక' యను నీ యలంకారగ్రంథమును రచియించినయాతఁడు - రసమీమాంసారచయితయగు కాశీశ్వరమిశ్రుని శిష్యుఁడును, సర్వజ్ఞసింగభూపాలుని యాస్థానకవీశ్వరుఁడును నగు విశ్వేశ్వరకవిచంద్రుఁడు[1] విశ్వేశ్వరకవి తనకృతిని సింగభూపాలకీర్తిసుధాసారశీతలనుగా నొనరించి,[2] గ్రంథమం దెల్లెడలను నాతని సాహితీధురీణతను, రాచకొండ రాజధానిగాఁ జేసికొని యా ప్రభువర్యుఁడు ప్రదర్శించిన శౌర్యౌదార్యాదికమును వెల్లడించి యున్నాఁడు.

---

1. తదిష్టమఖిల ప్రమాణసంసిద్ధే రససుధానిష్యందే సుమనోభి రనుభూయమానే రోగ్యానుపలబ్ధి లక్షణ మభావప్రమాణం రసావమానస్యైవ దురాగ్రహిణాం విపరీతసాక్షరాణాం మనసి వివర్త్యాభావ మేకో విభాసయతి. తథావోక్త మస్మదాచార్యైః కాశీశ్వరమిశ్రైః రసమీమాంసాయామ్.
చమత్కారచంద్రిక-పంచమవిలాసము.

2. కృతి రభిమతకృతిచతురా చతురోదాత్తనాయకగుణోదారా
ఇతి లక్షణకృతిరత్నం రచయే శ్రీసింగనృపగుణోదాహరణమ్.

....

ఇతి సరససాహిత్యచాతురీధురీణ విశ్వేశ్వరకవిచంద్రప్రణీతాయాం
శ్రీసింగభూపాలకీర్తిసుధాసారశీతలాయాం చమత్కారచంద్రికాయాం
వర్ణపదవివేకో నామ ప్రథమోవిలాసః.

చమత్కారచంద్రిక-ప్రథమవిలాసము.

రసార్ణవసుధాకరము—చమత్కారచంద్రిక.

ఈగ్రంథములందలి ప్రమేయము.

రసార్ణవసుధాకరము—ప్రథమవిలాసమున, నాయికానాయకలక్షణములు తద్భేదములు, శృంగారరసవిభావములు, రీతులు, గుణములు, వృత్తులు, సాత్త్వికభావములును లక్షణోదాహరణములతోఁ గూర్పఁబడినవి.

ద్వితీయవిలాసమున—సంచారిభావములు, రసాశ్రయవివేకము, సంభోగ విప్రలంభశృంగారరసభేదములు, కరుణాదిరసవిచారమును నిరూపింపఁబడినవి.

తృతీయమున—నాట్యస్వరూపము, లాస్యాంగములు, దశవిధరూపకములు, తదంగములు మున్నగు విషయములు, వివిధదృశ్యకావ్యములందలి యుదాహృతులతోఁ జర్చింపఁబడినవి.

చమత్కారచంద్రిక—ప్రథమవిలాసమున, వర్ణపదగుణదోషవిచారము,[3] ద్వితీయమున దోషస్వరూపనిరూపణము, తృతీయమున గుణదోషస్వరూపోదాహరణములు, చతుర్థమున వృత్తిరీతి పాకములు, క్షుద్రకావ్యస్వరూపమును, పంచమమున రసభావాదులు, షష్ఠమున శబ్దాలంకారములు, సప్తమమున అర్థాలంకారములు, అష్టమమున ఉభయాలంకారములును జర్చింపఁబడినవి. విద్యానాథవిరచితమయిన ప్రతాపరుద్రీయమునందువలె లక్షణములకు లక్ష్యములుగ నొసఁగఁబడిన శ్లోకములన్నియుఁ [illegible] సింగభూపాలనామగ్రథితములై యున్నవి.

---

3. ఈవర్ణవిచారమున నీకవి గూర్చిన శ్లోకములు ఆంధ్రలాక్షణికులచేఁ దమ ఛందోగ్రంథములం దాయాప్రసంగముల నుదాహరింపఁబడినవి. మఱియు అలూరి కందాలార్యునిచే రచింపఁబడిన 'అలంకారశిరోభూషణము' అను సంస్కృతాలంకారగ్రంథమునందును, గౌరనరచియించిన లక్షణదీపిక (సంస్కృతము) యందును నీప్రథమోల్లాసమునందలి శ్లోకములు ప్రమాణముగాఁ గైకొనఁబడినవి.

చూడుఁడు:—పరిషత్పుస్తక భాండాగారమునందలి 8441 సంఖ్యగల అలంకారశిరోభూషణము. ప్రథమోల్లాసము.

చూ. గౌరనవిరచితమయిన లక్షణదీపిక ప్రథమవిలాసము. సంఖ్య-2585.

ఈ రెండిటికిఁ గల పోలికలు-విరోధములు.

1. లక్షణనిర్మాణమున సరళత రెండిటను గలదు.

2. లక్షణసమన్వయమును దెలుపుట రెండిటను గలదు.

3. ఇతరాలంకారికుల మతములను ఖండించుచు స్వమతమును వ్యక్తముసేయుట రెండిటను గలదు.

4 కవులిద్దఱును స్వయముగఁ గూర్చిన శ్లోకములు రెండిటను మధురములే.

5. సుధాకరమున, కవి స్వయముగ రచియించి కూర్చిన శ్లోకము లల్పముగను, ఇతరకవుల కావ్యములనుండి శ్లోకము లధికముగను లక్ష్యములుగఁ గూర్పఁబడినవి. చంద్రికయందు కవి స్వయముగ రచియించిన శ్లోకము లధికముగను, ఇతర కావ్యములనుండి శ్లోకము లల్పముగను గైకొనఁబడినవి.

6. సుధాకరమున, సరస్వతీకంఠాభరణమున భోజుఁడు దెల్పిన మతము చాలవఱకు ఖండింపఁబడుచు వచ్చినది. చంద్రికయందుఁ జాలవఱకు భోజునిమత మనుసరింపఁబడుచు వచ్చినది.[4]

7. సుధాకరమున నాయికానాయక స్వరూపోదాహరణములు రసభావాదులు దశవిధరూపక స్వరూపమును విపులముగఁ జర్చింపఁబడినవి. చంద్రికలో నీయంశములు కొన్ని పూర్తిగ విడువఁబడినవి. కొన్ని మాత్రము సూక్ష్మముగఁ జర్చింపఁబడినవి.

8. సుధాకరమున లక్షణముల నామములు చాలవఱకుఁ బ్రాచీనాలంకారికులచే వాడఁబడినవియే సేకరింపఁబడినవి. చంద్రికలో నట్లుగాక లక్షణనామములు చాలవఱకు కవి స్వయముగ నిర్మించినవియే.

---

4. See Miscellanea-Literary notes (continued) by Dr. V. Raghavan B. A. (Hons) VI. The Chamatkara Chandrika of Visveswara. Annals of the Bhandarkar Oriental research Institute Poona, Vol. XVI page 131 to 140

9. సుధాకరమునందలి ప్రమేయము ప్రాచీనాలంకారికులు చర్చించినదియే. చంద్రికలో నట్లుగాక సంస్కృతాలంకారికు లెవ్వరును దమ గ్రంథములందుఁ జర్చింపని ఛందోవిషయము చర్చింపఁబడినది.

చరిత్రకుపయోగించు నంశములు.

సుధాకరోపక్రమమున, కృతికర్త వంశావళి కూర్పఁబడినది. అందున్, దాచనృపతి మొదలుగ కృతికర్తయగు సింగభూభర్త పుత్త్రులవఱకుఁ గల వంశవృక్షము స్పష్టముగఁ దెలుపఁబడినది.

చంద్రికలో రసార్ణవసుధాకరకర్తయు, విశ్వేశ్వరకవికృతికి భర్తయు నగు సింగభూపతి రాచకొండ రాజధానిగాఁ జేసికొని వింధ్య శ్రీశైలముల నడుమ నున్న యంధ్రక్షమామండలమును బాలించినట్లు తెలుపఁబడినది.[5] ఈ సింగభూపతిని కల్యాణభూపతియని పేర్కొనినాఁడు.[6] శ్లేషభంగిచే నొకశ్లోక మీ సింగభూపతి కల్యాణదుర్గమును జయించి, యచట జయస్తంభమును స్థాపించి, సామ్రాజ్యసింహాసనము నధిష్ఠించి నట్లు తెలియఁజేయుచున్నది.[7] ఈ కల్యాణదుర్గము కీ శే. కొమర్రాజు లక్ష్మణరావుగారు,తమవ్యాసావళియందుఁ దెలిపిన నైజాము ప్రాంతమునం

---

5. రాజా స రాజాచల నామధేయా
మధ్యాస్య వంశక్రమరాజధానీమ్
సతాంచరక్షా మసతాంచ శిక్షాం
న్యాయానురోధా దనుసందధార.

6. మండలీకృత కోదండో రణే కల్యాణభూపతిః
కరకంపితకల్హారో మీనాంక ఇవ రాజతే.

చ. చంద్రిక-తృతీయవిలాసము.

7. కల్యాణేక్షణవేష్టయా ప్రకటిత స్తంభప్రతిష్ఠాక్రమే
వం (మం?) దాతుశ్ఛవిసుందరే లలితదృక్కోణక్రియాతోరణే
భావోల్లాసవిలాసకే వరతనో రస్యా మనోమంటపే
శ్రీ సింగక్షితిపాలమూర్తి రభుతే సామ్రాజ్యసింహాసనమ్.

దలి కల్యాణపట్టణము కావచ్చునేమో?[8] విమర్శకులు నిర్ణయించెదరు గాక.

సింగభూపతి కళింగదేశాధిపతిపైఁ గోపింప నాతఁడు తనకన్నియ నీతని కర్పించి యనుగ్రహపాత్రుఁడయ్యెనని మఱియొకచోఁ జంద్రికలోఁ దెలిపియున్నాఁడు.[9] ముద్రితములయిన వెలుగోటివారి వంశావళులలోఁ జూపఁబడిన వంశవృక్షములఁ జొప్పున రసార్ణవసుధాకరకర్తయగు నీ సింగభూపతి యేడవతరమువాఁడు. ఈతని తాతయు సింగభూపతియే. తాతగారు జీవించియుండఁగ నీ మనుమనికిఁగూడఁ బ్రసిద్ధి చేకూరుటచే నీతనికి కుమారసింగభూపతి యను నామమేర్పడి, తరువాతి వంశక్రమమున నీ 'కుమార' యను శబ్దము బిరుదవాచకమై పరంపరాగతమగుచున్నట్లు గానవచ్చెడిని. కావుననే నేఁటికిని రేచర్లవంశీయులగు ప్రభువర్యులనామములు 'కుమార' శబ్దోపపదకములుగ నున్నవి. చంద్రికలో నీసింగభూపాలుని కుమారసింగభూపాలుఁ డని పేర్కొనినాఁడు.[10]

ఈసింగభూపతి యాస్థానకవియు, 'అమరపదపారిజాత' మను అమరకోశవ్యాఖ్యానమును రచియించిన బొమ్మకంటి అప్పయాచార్యుఁ

---

8. ఈకల్యాణము మహారాష్ట్రదేశమునందలి రైల్ స్టేషన్ అయిన కల్యాన్ కాదు. కన్నడదేశమందలి కల్యాణిపట్టణము. ఇది నైజామురాజ్యమునందు గుల్బర్గా జిల్లాలో నున్నది.
చూ. లక్ష్మణరాయవ్యాసావళి-చాళుక్యులు దాక్షిణాత్యులే. పుట ౫౫.

9. సింగక్షోణిభుజః కళింగనృభుజే క్రుద్ధస్య తస్మిన్ క్షణే
దత్తాంతత్తనయా ముపాయనతయా లోకోత్తమాంపశ్యతః
వ్యావృత్తా ధనుషః కటాక్షసరణి స్తన్వ్యాఃకిలతాలోకినీ
దృక్కోణం పరివృత్య రాగమహిమా చిత్తే పరం చేష్టతే.
చ. చంద్రిక-పంచమవిలాసము.

10. కుమారశ్రీసింగే జలధిరశనాం శాసతి మహీ
మమర్యాదా ధ్వస్తా పతితపరిణాహప్రతిభువః
అధర్మా నిర్మూలా నరకపరిపాకప్రణిధయో
వినష్టా దుశ్చేష్టా కలికలుషవేలీపరిధయః చ. చంద్రిక-సప్తమవిలాసము.

దును నీతని 'కుమారసింగభూపతి' యని పలుమారు లుగ్గడించియున్నాఁడు. ఆప్రసంగముననే సింగభూపాలుని పాండితీవైభవమును సుస్పష్టముగఁ జాటియున్నాఁడు.[11]

విశ్వేశ్వరుఁడు తన కృతిభర్తయగు సింగభూపతి రసార్ణవసుధాకరమును రచియించినట్లు వాచ్యముగను, సంగీతసుధాకరమును రచియించినట్లు వ్యంగ్యముగను చంద్రికలోఁ దెలిపియున్నాఁడు. ఆశ్లోకముల నిట నుదాహరించెదను.

రూపకం దశధా ప్రోక్తం నాటకాదివిభేదతః
మహాప్రబంధసామ్రాజ్య మధికర్తు మిదం క్షమం
సింగభూపాలరచితే రసావర్ణవసుధాకరే
అస్య ప్రపంచో విజ్ఞేయః కే తథా వక్తు మీశతే.

చ-చంద్రిక, తృతీయవిలాసము.

అనుక్తానా మిహాన్యేషాం లక్ష్యలక్షణవిస్తరః
సింగభూపాలరచితే రసావర్ణవసుధాకరే
ఆదిద్వితీయయో స్సాధు శీలనీయో విలాసయోః

చ-చంద్రిక, పంచమవిలాసము.

---

11. శ్లో. రేచర్లకులసంభూతేరాస్థానాఖ్యాం సింగభూపతేః
బొమ్మకంటిప్పయాచార్యమూర్త్యా జాగర్తి శారదా ౧.
కుమారసింగభూపేన లక్ష్యలక్షణవేదినా
శోధితశ్చేదయం గ్రంథః కిం శోధ్య శ్శోధకాంతరైః ౨.
కుమారసింగభూపేన యః కదాపి న శోధితః
సగ్రంథ శ్శోధితోఽప్యన్యైః కిం బుధై ర్వ్యవహ్రియతే 3.
కావ్యాలంకారనానార్థతత్త్వభావితమానసః
కుమారసింగభూపాల ఏక ఏవాస్తి నాపరః ౪.
కుమారసింగభూపాలకృతయ స్తస్య నిత్యశః
విధయన్తి మదం దృష్టా దృష్టాన్తాః కృతినః పరమ్. ౫.
అమరపదపారిజాతము-తుదిశ్లోకములు.

రసార్ణవసుధాకరము—చమత్కారచంద్రిక.

సంగీతక్రమచంక్రమప్రియసఖీ శృంగారసంజీవనీ
సౌజన్యద్రుమసారణీ చతురతాసామ్రాజ్యసింహాసనం
శ్రీ సింగక్షితిపాలశేఖరమణే ర్వైయాత్యఘంటాపథ
శ్చాటువ్యాహృతివైఖరీ విజయతే సాహిత్యశిల్పావధిః

చ-చం. చతుర్థవిలాసము.

'రసార్ణవసుధాకర' 'సంగీతసుధాకర'ముల తుదిగద్యలపోలికను బట్టిచూడ నీరెంటిని రచియించిన సింగభూపతియొక్కఁడేయని తెలియుచునేయున్నది. నామసామ్యమునను ఏకకర్తృకత్వము స్థిరపడుచున్నది[12]

శ్లో. అథ శ్రీసింగభూపాలో దీర్ఘాయు ర్వసుధామిమామ్
నిజాంసపీఠే నిర్వ్యాజం కురుతే సుప్రతిష్ఠితామ్.

రసా-సుధా, ౧ విలాసము. శ్లో. 27

అనఁగా, సింగభూపాలుఁడు దీర్ఘాయుర్దాయముగలవాఁడై చిరకాలము తన యంసపీఠియం దీభూవలయమును స్థిరముగ నున్నదానిఁగా నొనర్చెనని భావము. వెలుగోటివారి వంశవృక్షక్రమమున నేడవతరమువాఁడగు నీసింగభూపతి రాజ్యప్రారంభకాలమును గాని, తుదిసమయమునుగాని యిదమిత్థమని నిర్ణయించుటకుఁ దగిన శాసనాద్యాధారములు నేఁటిదనుకఁ గానరాకున్నవి. కాని పైశ్లోక మాతఁడు చిరకాలము జీవించినట్లును, చిరకాలము రాజ్యమును బాలించినట్లును ప్రబలమయిన సాక్ష్యము నిచ్చుచున్నది.

---

12. శ్రీమదాంధ్రమండలాధీశ్వర ప్రతిగండభైరవ శ్రీయన్నపోతనరేంద్ర నందన భుజబలభీమ శ్రీసింగభూపాలవిరచితే రసార్ణవసుధాకరనామ్ని నాట్యాలంకారే భావోల్లాసోనామ తృతీయోవిలాసః. రసా. సుధా-తుదివచనము.
శ్రీమదాంధ్రమండలాధీశ్వర ప్రతిగండభైరవ శ్రీఅనవోత............నభుజబలభీమ శ్రీసింగభూపాల విరచితాయాం సంగీత సుధాకరాఖ్యాయాం సంగీత రత్నాకరవ్యాఖ్యాయాం ప్రబంధాధ్యాయశ్చతుర్థ స్సమాప్తః
See-Descriptive Catalogne of manuscripts (Alankara) Bhandarkar Oriental Research Institute Poona. Page 407.

మఱియు నీసింగభూపతి, వంశమును బెంపొందించు సుతులతోఁ గూడ వింధ్యశ్రీశైలముల మధ్యమున్న యాంధ్రమండలమును బాలించుచు వివిధమయిన భోగముల ననుభవించెనని యీక్రింది శ్లోకము చాటుచున్నది.

శ్లో. వింధ్య శ్రీశైలమధ్యస్థాన్ధ్రమండలం పాలయన్ సుతైః
వంశప్రవర్తకై రర్థాన్ భుఙ్క్తే భోగపురందరః

రసా. సుధా. ౧ విలాసము. శ్లో. 42

పై రెండు శ్లోకములనుబట్టిచూడ నీసింగభూపతి పుత్త్రులతోడను పౌత్త్రులతోడనుగూడి చిరకాలము రాజ్యము పాలించినట్లు తెలియుచున్నది గదా! కావున శ్రీనాథుని సమయమునకును నీతఁడు జీవించియే యుండవచ్చును. శ్రీనాథుఁడు సరస్వతీస్తుతిపూర్వకముగ దర్శించి మన్ననవడసినట్టియు, సర్వజ్ఞబిరుదాంకితుఁడు, కృతికర్త, కృతిభర్తయు నగు సింగభూపతి రసార్ణవసుధాకరకర్త యయిన సింగభూపతియే కావచ్చును.[13]

రసార్ణవసుధాకరకర్తకు సర్వజ్ఞబిరుదము గలదా?

రసార్ణవసుధాకరకర్తయయిన సింగభూపతికి సర్వజ్ఞబిరుదము లేదనియే చాలమంది విమర్శకుల యూహ. రసార్ణవసుధాకరమునఁ గానరాదు. సంగీతసుధాకరమునఁ గలదేమో తెలియరాదు. కాని, చమత్కారచంద్రికయందును, అమరపదపారిజాతము (బొమ్మకంటి అప్పయాచార్య విరచితము) నందును లేదనుట యెంతవఱకుఁ బొసఁగునో విమర్శింపవలసియున్నది. చంద్రికను రచియించిన విశ్వేశ్వరకవియు, అమరకోశవ్యాఖ్య రచియించిన అప్పయాచార్యుఁడును సింగభూపాలుని సాహితీవైభవమును దమ శక్తికొలఁది కొఱఁత లేకుండ వ్యక్తము చేసియు, వానిని బరమప్రామాణికాలంకారికునిగా నంగీకరించినట్లు పెక్కుశ్లోకములఁ దమగ్రంథములందుఁ దెలిపియున్నారు. మఱియు వీరిద్దఱు వాచ్య

13. ఈకవుల కాలనిర్ణయమునకు వేఱొక వ్యాసమునఁ దెలుపఁబడెడు.

ముగను శ్లేషమూలమునను నాతని సర్వజ్ఞబిరుదము నుగ్గడించి యున్నారు ఆశ్లోకముల నిచటఁ బొందుపఱుచుచున్నాఁడను.

శ్లో. విద్యాద్వైవత తాతతావకగురో సర్వజ్ఞచూడామణే
స్తోతవ్యోఽసి మనీషిణాం త్వమథవా మన్యోజవాక్యై రలం
ఇత్థం సింగమహీపతిం గురుజనోఽప్యాభాషతే దో-వాన్
తత్తత్పద్ధతిధర్మమర్మణి పరిచ్ఛేదావి సంవాదికమ్.[14]

ఇందలి 'సర్వజ్ఞచూడామణే' యను పదము సంబోధనప్రథమా విభక్త్యన్తమేగాన బిరుదవాచకమనుటకు సంశయమక్కఱలేదని నా యూహ.

ఇటులనే బొమ్మకంటి అప్పయాచార్యుఁడు తాను రచియించిన అమరపదపారిజాతము తుది నీక్రిందిశ్లోకమునుబొందుపఱచియున్నాఁడు.

శ్లో. జైవాతృకం బుధగురుం నిలయం కలానాం
సర్వజ్ఞమూర్ధమణి మాశ్రితసుద్ధపక్షమ్
శ్రీబొమ్మకంట్యుపపదాంకిత మప్పయార్యం
సర్వేప్సితోషితసురం ద్విజరాజ మాహుః

ఈశ్లోకమందలి విశేషణములన్నియు శ్లేషమహిమచే అప్పయార్యునకును, చంద్రునకును సరిపడుచున్నవి. అప్పయార్యునిపక్షమున "సర్వజ్ఞః మూర్ధమణిః యస్య తం అను వ్యుత్పత్తిచే సర్వజ్ఞబిరుదాంకితుఁడైన సింగభూపతి ప్రామాణికశిరోమణిగాఁగలవాఁడు" అను నర్థము సర్వజ్ఞమూర్ధమణిం అనుపదమునకు సిద్ధించును. కావున వివిధలక్షణ లక్ష్యవేత్తయు, కావ్యాలంకారతత్త్వవేత్తయు, కృతికర్తయునగు తన యేలికకు సహజసిద్ధమయిన 'సర్వజ్ఞ' బిరుదము నీయప్పయార్యుఁడును

14. ఈశ్లోకమందలి 'సర్వజ్ఞచూడామణే' అను నీపదము పరిషత్పుస్తకభాండాగారమునందలి వ్రాఁతప్రతియందును, మదరాసు దొరతనమువారి ప్రాచ్యలిఖితపుస్తకభాండాగారమునందలి D 2-9-60 R 2679 సంఖ్యగలవ్రాఁతప్రతియందును స్పష్టముగాఁ గన్పట్టుచునే యున్నది.

స్మరియించెననుటలో విప్రతిపత్తి యుండనక్కఱలేదని నా యూహ. కావున నీకవివర్యులచే నుగ్గడింపఁబడి, ఆనాఁటి పండితవ్యవహారములో నెలకొనియున్న యీసర్వజ్ఞబిరుదమే తఱువాతివారి కందఱకు వచ్చిన ట్లూహించుట సమంజసము; కాని, రసార్ణవసుధాకరకర్తకు సర్వజ్ఞబిరుదము లేదని త్రోసివేయుటమాత్ర మెట్లును బొసఁగదు.

గ్రంథకర్తృత్వ నిర్ణయము.

వెనుక నేఁ దెలిపినరీతిని విశ్వేశ్వరకవి అప్పయాచార్యులును నీతనిఁ గృతికర్తగాఁ దమగ్రంథములఁ దెలిపియున్నారు. కాని, కొందఱు రసార్ణవసుధాకరమును సింగభూపతి రచించియుండలేదేమో? విశ్వేశ్వరకవియే దీనిని రచించి సింగభూపాలునిపై నారోపించినాఁడేమో? అను నొక సంశయమును బొందుచున్నారు.

వారు, రసార్ణవసుధాకరకర్త సింగభూపాలుఁడు కాదనుటకుఁ దెలుపు హేతువులు—1. గ్రంథకర్త సుధాకరమునఁ దన్నుఁగూర్చి తాఁ జెప్పుకొనుట 2. 'మయ్యేవ కందర్పసంభవే' అని సుధాకరమునను చంద్రికయందును శ్లోకముల సిద్ధముగ నుదాహరించుట 3 సుధాకరమునందలి శ్లోకములే కొన్ని చమత్కారచంద్రికయందును గానవచ్చుటయు నివి. ఈహేతువులెంతవఱకు స్థిరపడునో పరీక్షించిచూతము

కవి తన్నుఁగూర్చి తాఁ జెప్పుకొనినపద్యము లన్నియుఁ దానే రచియించెననుటకుఁ బ్రమాణము మృగ్యము. అట్లాతఁడే రచియించెనన్నను, దన్నుఁగూర్చి తాఁ జెప్పుకొనినమాత్రమున గ్రంథకర్తృత్వమునకు భంగము వాటిల్లనేరదు. అట్లేయయినచో భోజవిరచితమయిన సరస్వతీకంఠాభరణమునందును భోజునిఁగూర్చి చెప్పినశ్లోకము గానవచ్చుచుగాన నదియు భోజకర్తృకము కాదనవలసివచ్చును.[15] ఎవ్వరేని భోజునిఁగూర్చి

15 జయ జయ జయ శ్రీమన్ భోజ ప్రభాతి విభావరీ
వద వద వద శ్రేయం విద్వన్ ఇదం వ్యాధీయతే
శృణు శృణు శృణు త్వద్వ తూస్నోస్యోఽమరజ్యోతి మండలం
నహి నహి నహి ష్మామార్తాండః క్షణేన విరచ్యతే.

చూ. సరస్వతీ కంఠాభరణము. 2 వ పరిచ్ఛేదము-183 శ్లో.

చెప్పిన పద్యమందుఁ బ్రవేశించెనందురా యిచ్చటను నట్లే యూహింప నగును.

మఱియు సర్వసమర్థుఁడయిన కవి తన్నుఁగూర్చి తనగ్రంథమునఁ దాఁజెప్పుకొనుట యాతనికిఁగల గ్రంథగ్రథనపాటవమును దెల్పునుగాని, యంతమాత్రమున గ్రంథకర్తృత్వమునకు భంగమును గల్గింపనేరదు. కాదందురా ? రసగంగాధరకర్తయగు జగన్నాథపండితరాయలకు నిట్టి యవస్థయే తటస్థించును. పండితరాయలు తన్నుఁగూర్చి చెప్పుకొనిన శ్లోకము:—

శ్లో. ఆమూలా ద్రత్నసానోర్మలయవలయితా దాచకూలాత్పయోధే
ర్యావన్త స్సన్తి కావ్యప్రణయనపటవ స్తే విశంకం వదన్తు
మృద్వీకామధ్యనిర్యన్మసృణరసఝరీమాధురీభాగ్యభాజాం
వాచా మాచార్యతాయాః పద మనుభవితుం కోఽస్తిధన్యో మదన్యః.

చూ. రసగంగాధరము, ప్రథమాననము, గర్వోదాహరణము.

ఆంధ్రభాషయం దుత్తమ ప్రబంధములు రచియించిన కవీశ్వరులు పెక్కుఱు తముఁగూర్చి తారుప్రౌఢముగఁ జెప్పుకొనియేయున్నారు. కావున నిట్లు చెప్పుకొనుట గ్రంథకర్తృత్వమునకు భంగముసేయఁజాలదు. ఇఁక రసార్ణవసుధాకరమున నొకశ్లోకము-

"యథాకందర్పసంభవే మమైవ
శ్లో. ఉభే తదానీ ముభయోస్తు చిత్తే
కదుష్ణనిశ్వాసచణేష్ణుకేన
ఏకీకరిష్య న్ననురాగశిల్పీ
రాగోష్మణైవ ద్రవతా మనైషీత్."

అను నీరీతిగ నుదాహరింపఁబడినది.[16] నాగరిలిపిముద్రణము నందే యీశ్లోకము గానవచ్చుచున్నది. మైసూరునందు ముద్రితమయిన

16. చూ. రసార్ణవ సుధాకరము. అనన్తశయన గ్రంథావళి 20. రెండవ విలాసము. 112 శ్లో. (నాగరిలిపి ముద్రణము)

తెలుఁగులిపి రసార్ణవసుధాకరమున నీతావున నీశ్లోక ముదాహరింపఁబడ లేదు. ఈశ్లోకము లేకుండుటయేగాదు. ఈ శ్లోకమునకుఁ బూర్వమందున్న మూఁడు శ్లోకములందు నిందును వేర్వేఱుగఁ గన్పట్టుచున్నవి. రెండుప్రతు లందును నిట్టిమార్పులు పెక్కులు గానవచ్చుచునే యున్నవి.

చమత్కారచంద్రిక-చతుర్థవిలాసమునందు-

శ్లో. "ముఖప్రదానైరవిలంబపూర్వైః కంఠగ్రహైః క్షిప్రవిపీడితాంగైః
కరప్రచారైశ్శిథిలోపరోధైః లబ్ధైః ప్రియాయా ముముదే ముకుందః

ఇతి కందర్పసంభవే"

అను నీరీతిగ నీశ్లోకము రెండు తావులందును,

"తథాచ మమైవం

చిక్షేపలక్ష్మీర్నిటలేనభాగైః ప్రస్వేదవారాతప మాక్షిపన్తీ
జుగోప దేవోఽపి సరోమహర్షం జవాబ్ధివాతాహతికైతవేన

ఇతికందర్పసంభవే"

అను నీరీతిగ నీ శ్లోకమొకతావునందును కందర్పసంభవమునుండి యుదాహరింపఁబడినవి. కాని "తథాచ మమైవ, ఇతికందర్పసంభవే"అని-శ్లోకము చమత్కారచంద్రికయం దుదాహరింపఁబడియుండలేదు. మదరాసు దొరతనమువారి ప్రాచ్యలిఖిత పుస్తకభాండాగారమునందున్న వ్రాఁతప్రతియందుఁగాని, పరిషత్పుస్తకభాండాగారమునందలి వ్రాఁత ప్రతియందుఁగాని 'మమైవ' అని కానరాదు. "తథాచమమైవం" అనియే రెండిటను గలదు. మఱియు నీ "చిక్షేపలక్ష్మీ" రిత్యాదిశ్లోకము రసార్ణవ సుధాకరమునను దాహరింపఁబడినది.[17] కానియిట,'మమైవకందర్పసంభవే' అనిగాని, 'ఇతికందర్పసంభవే' అనిగాని పేర్కొనినట్లుగానరాదు. విశ్వే శ్వరకవి కందర్పసంభవమును దానే రచియించెనని చెప్పుకొనఁదలఁచి

17. చూ. రసార్ణవసుధాకరము. ద్వితీయవిలాసము పుట ౨౨ తెలుఁగులిపి ముద్రణము
" " పుట 125 నాగరిలిపి ముద్రణము

నచో 'మమైవ' అని యుండవలెనుగాని, 'మమైవం' అనుట శాస్త్రపరి పాటికాఁజాలదు. కావున కర్తృత్వవిషయమున సంశయగ్రస్తములయిన యీ శ్లోకములనాధారముగాఁ జేసికొని సింగభూపతి రసార్ణవసుధాకరమును రచియింపలేదనుట యెట్లును బొసఁగఁజాలదు.

మఱియొకమాట. సింగభూపాలునకు గ్రంథకర్తృత్వసామర్థ్యము లేదందుమా? అట్లయినచో విశ్వేశ్వరకవి తనచంద్రికలో నాతనిప్రతాపాదివైభవముకంటె సాహిత్యవైభవమును నధికముగఁ జాటుట తటస్థించునా? కవులు తమకృతిభర్తలను స్తుతించునవసరములందు బుధరంజనుఁడని, కవికల్పతరువని, సాహిత్యగోష్ఠీప్రియుఁడని వర్ణించుట సహజముగాని, సాహిత్యశిల్పావధియని, సాహిత్యసామ్రాజ్య ధురంధరుఁడని, ప్రామాణికలాక్షణికుఁడని వర్ణించుపట్ల నాప్రభువునం దంతటి ప్రతిభావిశేషము లేకుండ విచ్చలవిడిగఁ బొగడుట తటస్థించునా? ఈతఁడేగాక యీప్రభువర్యుని యాస్థానకవియగు బొమ్మకంటి అప్పయార్యుఁడును నీతని లక్ష్యలక్షణవేత్తయని, కావ్యాలంకారతత్త్వవేత్తయని, గ్రంథసంశోధకులలో నుత్తముఁడని, కృతికర్తయనియుఁ దెలిపినాఁడు. ఈతఁడును గేవలమతిశయోక్తిగనే వర్ణించెనందుమా?

ఈ సింగభూపాలునకు సమకాలికుఁడో లేక కొంచెమిటీవలివాఁడో యగు మల్లినాథుఁడు రసార్ణవసుధాకరమునందలి శ్లోకములను సింగభూపాలీయములోనివని, తాను రచియించిన కావ్యవ్యాఖ్యలయం దుదాహరించియున్నాఁడు. అయిదాఱు శతాబ్దములు గడచిపిమ్మట నేఁడు సంశయమునకుఁ దావలమయినను, నాతనికాలమునకు సన్నిహితుఁడు, మూలము లేకుండ నొక్కయక్షరము నైనను వ్రాయని పరమ ప్రామాణికుఁడునగు మల్లినాథసూరి విశ్వేశ్వరకర్తృకమయిన రసార్ణవసుధాకరమును, సింగభూపాలీయమని చెప్పునుట పొసఁగునా?[18]

18. తాం ప్రత్యభివ్యక్తమనోరథానాం.........శృంగారచేష్టా వివిధాబభూవుః అను శ్లోకవ్యాఖ్యానమున "అత్ర శృంగారలక్షణం రససుధాకరే" ఇత్యాదిగాను

సింగభూపాలుఁడు రసార్ణవసుధాకరమునేగాక సంగీతసుధాకరమునుగూడ రచియించెనని వెనుకఁ దెలిపియుంటిని. సంగీతసుధాకరమును విశ్వేశ్వరకవివిరచితమై సింగభూపాలునిపేర వెలసెనందుమా ? మఱియు నీ రెండు గ్రంథముల (రసార్ణవసుధాకరచంద్రికలను) నొకకవియే రచియించినచో సుధాకరమున భోజునిమతమును ఖండించినయాతఁడు చంద్రికలో భోజునిమతముననుసరించునా ?[19] రెండిటి నొక్కరే రచియించెనను

ద్దాహరించిన శ్లోకములు రసార్ణవసుధాకరమున 48, 49, 145 పుటలలోఁ గానవచ్చుచున్నవి. చూ. రఘువంశము-6 వ సర్గ మల్లినాథవ్యాఖ్య (నాగరిలిపిముద్రణము)

మఱియు "తదుక్తం భూపాలేన" అని యుదాహరించిన శ్లోకము లీ సింగభూపాలీయమునఁ గానవచ్చుచున్నవి.

ముక్తాఫలేషు ఛాయాయా స్తరళత్వ మివాంతరా
ప్రతిభాతి యదంగేషు తల్లావణ్య మిహోచ్యతే"

ఈశ్లోకమునుదలుచుగ మల్లినాథుఁడు వ్యాఖ్యలయం దుదాహరించినాఁడు. ఇదియె రసా-సుధ ప్రథమవిలాసము 41 వ పుట 181 వ శ్లోకముగఁ గానవచ్చుచున్నది.

* కుమారసంభవము సప్తమసర్గ 91 వ శ్లోకవ్యాఖ్యానమునందలి "కైశిక్యారభటీచైవ" ఇత్యాది శ్లోకములు ప్రథమ విలాసము 87 వ పుటలోఁ గానవచ్చుచున్నవి.

చూ. (నాగరిలిపి ముద్రణము) పుట: 87.

---

19. "భోజే నోక్తాః స్థాయినోఽన్యే గర్వః స్నేహో ధృతిర్మతిః
స్థాస్యన్తరే వోద్ధతప్రాయః శాంతోదాత్తరసేష్వపి
తత్ర స్నేహో రతే ర్భేదః స్త్రీపుంసేచ్ఛాత్మకత్వతః"

ఇత్యాది శ్లోకవ్యాఖ్యానావసరమున భోజుని మతము ననువదించి, విపులముగఁ జర్చించి ఖండించియున్నాఁడు.

చూ. రసార్ణవసుధాకరము-అనన్తశయన గ్రంథావళి నెం. పుట 168-175.

చమత్కార చంద్రికయందు సరస్వతీకంఠాభరణమునందును చాలవఱకు సమానమయిన శబ్దములుగల శ్లోకములను బరికింపుఁడు.

శ్లో. అలమర్థానలంకర్తుం యద్వ్యుత్పత్త్యాది వర్త్మనా
జ్ఞేయా జాత్యాదయః ప్రాజ్ఞైస్తేఽర్థాలంకార సంజ్ఞయా
జాతిర్విభావనాహేతు రహేతుస్సూక్ష్మ ముత్తరం
విరోధ స్సంభవోఽన్యోన్యం పరివృత్తిర్నిదర్శనా

భేదస్సమాహితం భ్రాన్తి ర్వితర్కో మీలితంస్మృతిః
భావః ప్రత్యక్షపూర్వాణి ప్రమాణానివ జైమినేః
నానావస్థాసు జాయన్తే యాని రూపాణి వస్తునః
స్వేభ్యస్స్వేభ్యో౽సర్గేభ్యస్తాని జాతిం ప్రచక్షతే.

చూ. సరస్వతీకంఠాభరణము 3వ పరిచ్ఛేదము. నిర్ణయసాగరముద్రణము-పుట 311-312.

శ్లో. అలమర్థానలంకర్తుం యేతద్వాశ్రయశోభినం
యేతు జాత్యాదయః ప్రాజ్ఞైస్తేర్థాలంకార సంజ్ఞయా
జాతిర్విభావనా హేతు రహేతుస్సూక్ష్మముత్తరం
విరోధస్సంభవో౽న్యోన్యం పరివృత్తి ర్నిదర్శనం.
భేదస్సమాహితంభ్రాంతిః వితర్కో మీలితం స్మృతిః
భావో౽నుమానార్థాపత్తి రితి తే వింశతిః స్మృతాః
చూ. చమత్కారచంద్రిక. సప్తమవిలాసము ప్రారంభము.

శ్లో. శబ్దేభ్యో యః పదార్థేభ్య ఉపమాదిః ప్రతీయతే
విశిష్టోర్థఃకవీనాంతా ఉభయాలంక్రియా మతాః
ఉపమా రూపకం సామ్యం సంశయోక్తి రపహ్నుతిః
సమాధ్యుక్తి స్సమాసోక్తి రుత్ప్రేక్షా ప్రస్తుతస్తుతిః
సతుల్యయోగితోల్లేఖః ససహోక్తిస్సముచ్చయః
సాక్షేపో౽ర్థాంతరన్యాసః సవిశేషా పరిష్కృతిః
దీపకక్రమపర్యాయాతిశయశ్లేష భావికాః
సంసృష్టి రితి నిర్దిష్టా స్తాశ్చతుర్వింశతిర్బుధైః

మా. సరస్వతీకంఠాభరణము 4వ పరిచ్ఛేదము. నిర్ణయసాగర ముద్రణము-పుట 398-399

శ్లో. శబ్దేభ్యో య ఇవాదిభ్య ఉపమాదిః ప్రతీయతే
విశిష్టార్థకఃవీనాంతా ఉభయాలంకృతయోమతాః
ఉపమారూపకం సామ్యం సంశయోక్తి రపహ్నుతిః
సమాధ్యుక్తి స్సమాసోక్తి రుత్ప్రేక్షా ప్రస్తుతస్తుతిః
సతుల్యయోగితోపేతః (ల్లేఖః?) సమాసోక్తిస్స ముచ్చయః
ఆక్షేపార్థాంతరన్యాసౌ సవిశేషాపరిష్కృతిః
దీపనక్రమపర్యాయాతిశయశ్లేష భావనాః
సంసృష్టిరితి నిర్దిష్టా స్తా శ్చతుర్వింశతి ర్బుధైః
మా. చమత్కారచంద్రిక-అష్టమవిలాసము ఆరంభము.

టకు సర్వథావిరోధియగు విషయ మొక్కటి గమనింపుఁడు. ఒకకవియే రెండు గ్రంథములను రచియించినపుడు, ఒకయంశమునందే మతభేదము నుదెల్పుట సంభవించునా? చూడుఁడు:—సుధాకరకర్తమతమున రీతులు మూఁడు. చంద్రికాకర్తమతమున రీతులు నాలుగు. రెండిటను నామము లందుసైతము భేదమే గానవచ్చుచున్నది.[20]

రసార్ణవసుధాకరమునందలి శ్లోకములను చంద్రికలో నుదాహరించుట విశ్వేశ్వరకవికి సింగభూపాలునియెడలఁ గలిగిన ప్రామాణికత్వమును హెచ్చించి, ఆ ప్రభువర్యుని కుండెడి పాండిత్యవైభవమును వ్యక్తము చేయుటకుఁగాని, యది గ్రంథకర్తృత్వమును సంశయగ్రస్తమునుగ నొనరింపఁజాలదు.

కావునఁ బైయంశముల ననుసరించి, రసార్ణవసుధాకరమును రచియించిన కవివరేణ్యుఁడు సింగభూపాలుఁడే; చమత్కారచంద్రికను రచియించిన కవిచంద్రుఁడు విశ్వేశ్వరుఁడే; యనుట నిర్వివాదమని నా యూహ.

ఏనాఁటికయిన సరససాహిత్యచాతురీధురీణుఁడగు నీ విశ్వేశ్వరకవి రచియించిన 'చమత్కారచంద్రిక' అను నీ యలంకారగ్రంథము విద్యాభిమానముగల ధనికుల యాదరమునకుఁ బాత్రమై ముద్రణభాగ్యము నందఁగల్గినచో ఆంధ్రమండలాధీశ్వరుఁడగు సింగభూపాలుని యశఃప్రశస్తులు లోకమం దెల్లెడలను జిరస్థాయులై విలసిల్లఁగలవని సవినయముగ నివేదించుచున్నాఁడను.

---

20. రీతిస్స్యాత్పదవిన్యాస భఙ్గీ సాతు త్రిధామతా
కోమలా కఠినా మిశ్రాచేతి స్యాత్-ఇత్యాది

రసా-సుధా-ప్రథమవిలాసము పుట 64 నాగరిలిపి ముద్రణము.

రీతిః పదానాం ఘటనా ప్రోక్తా రీతివిశారదైః
రీఙ్గతా వితతౌ ధాతో రియం రీతి రితీర్యతే
అసమాసా సమాసేన మధ్యమేన సమన్వితా
అతిదీర్ఘసమాసాచ మిశ్రాచేతి చతుర్విధా.

చమత్కారచంద్రిక-చతుర్థవిలాసము.

శ్రీనాథునిఁగూర్చిన ప్రసంగములు.

చిలుకూరి పాపయ్యశాస్త్రి.

ఈ శా న సం హి త.

శ్రీనాథకవిసార్వభౌముని చరిత్రమును ఆతనికృతులను బాగుగ విమర్శించి, యనేకనూతనాంశముల నాంధ్రలోకమున కెఱుకపఱిచి, యా కవిమొదలఁ దమకుఁగల కృతజ్ఞతను వెల్లడించుచు బ్రహ్మశ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు 'శృంగారశ్రీనాథ' మను సద్గ్రంథము రచించినారు. శ్రీనాథునికృతులనన్నిటిని పెక్కు తాటియాకులప్రతులతో సంప్రతించి, విశుద్ధమగు పద్ధతిని సంస్కరించి పునర్ముద్రణము గావించుటయందు వారి కాదరము మెండు. అట్లు పూనుకొని క్రీడాభిరామమును హరవిలాసమును సంస్కరించి ముద్రింపించినారు. కాశీఖండమును ముద్రింపింపనై యున్నారు.

తొలుత నాంధ్రసాహిత్యపరిషత్తువారు ప్రకటించిన శివరాత్రిమాహాత్మ్యమునకు మూలమైన 'ఈశానసంహిత' లభింపమిచేఁ బాఠకులకు నాతురత గలిగినది. దాదాపు రెండు వత్సరములక్రితము శ్రీప్రభాకరశాస్త్రిగారు "మాహాత్మ్యమునకు మూలమగు ఈశానసంహిత"అని యొక వ్రాఁతప్రతిని బంపి, అద్దానిని ముద్రింపఁగోరిరి ఆ ప్రతి ముఖపత్రమున నిట్లు కలదు.

"ఈశానసంహితా"

శ్రీనాథుని శివరాత్రిమాహాత్మ్యమున కిదిమూలము. దీనిఁబట్టి చూడఁగా శ్రీనాథకృతి యింకను గొంతతుదిపట్టున దొరకవలసియున్నట్టు గుర్తింపనగును. వే. ప్ర.

ఇఁకఁ దుదిపుటయందీప్రతికి మాతృకనుగూర్చి Restored-copy No. R 5583 T 6-3-8 Original no 5428 అనికలదు.‡

---

‡మద్రాసు దొరతనమువారి ప్రాచ్యలిఖిత పుస్తకభాండాగారమునందలి గ్రంథమునకిది పుత్త్రిక గాన నీసంఖ్యాదిక మాపట్టికలోనిది.

నేటి విమర్శకులలో నగ్రగణ్యులగు వారివాక్యములను బురస్కరించుకొనియే పరిషత్పత్త్రికలో నీ 'ఈశానసంహిత' అను సంస్కృత గ్రంథమును ముద్రింపించినారము.* పిదప బ్రహ్మశ్రీ కట్టి సాంబమూర్తి శాస్త్రిగారు ముద్రితమైన యీసంహితకును మాహాత్మ్యమునకును గల తారతమ్యములను బరిశీలించుచు నొకవ్యాసము పరిషత్పత్త్రికయందే ప్రకటించియున్నారు. †అందు వారు శ్రీనాథుని శివరాత్రిమాహాత్మ్యము నాధారముగాఁజేసికొని యర్వాచీనులెవరో యీసంహితను గూర్చియుందురనితమ యభిప్రాయమును వెల్లడించియున్నారు.

సాధారణముగా శ్రీనాథుఁడు రచించిన ప్రబంధములకు మూలములు ప్రాచీనపురాణములుగాని కావ్యములుగాని అయి తీరునను నిర్ణయముతో నేను చెన్నపురి ప్రాచ్యలిఖిత పుస్తకభాండాగారమునందలి ఈశానసంహితను జూచితిని. ఆగ్రంథ మీస్థితిలోనున్నది.

౧. అరటావుసైజు పేఁపుకాగితములపై నిరుప్రక్కల వ్రాయఁబడినది.

౨ మిక్కిలి శిథిలముగ నున్నది. నడుమఁ బుటలుకొన్ని క్రిమిదష్టములు. వ్రాఁతతీరు బాగుగనున్నది.

3. తొలుత బ్రహ్మోత్తరఖండమునందు మొదటినుండి యిరువదిరెండధ్యాయములవఱకుఁ గ్రమముగనున్నది. ఈ భాగము నాగరిలిపిలో ముద్రితమైన స్కాందార్గత బ్రహ్మోత్తరఖండముతో సరిపడునది. ఆ వ్రాఁతప్రతియందే అట్టలనడుమ 'ఈశానసంహిత'యని నామమిడిన ఈ మూఁడధ్యాయముల గ్రంథము వేఱుగ నుంచఁబడినది.

బ్రహ్మోత్తరఖండ మెట్టి కాగితములపై వ్రాయఁబడియున్నదో యీ మూఁడధ్యాయములు నట్టికాగితముల పైననే వ్రాయఁబడియున్నవి. వ్రాయసగాఁడుకూడ నొక్కఁడే. వ్రాఁతకుపయోగించిన సిరాయును నొక్కటే. ఇచటఁ దొలుతటిది 70 వ యధ్యాయము. రెండవది

---

* చూ. పరిషత్పత్త్రిక. సం. ౨౯. సం. ౪.

† చూ. పరిషత్పత్త్రిక. సం. 30. సం. ౨. 3.

24 వ యధ్యాయము. మూఁడవది 73 వ యధ్యాయము. ఈ యధ్యాయము వ్రాసిన కాగితములమీఁద "బ్రహ్మోత్తరఖండము ౭౦-బ్రహ్మోత్తరఖండము ౭౩-" అను శీర్షకములు కలవు. 24 వ అధ్యాయము వ్రాసిన కాగితములమీఁద "ఈశానసంహిత" అను శీర్షకము గలదు. 70 వ అధ్యాయమున శివరాత్రివ్రతవిధానము, ఫలము మున్నగునవియును, 24 వ అధ్యాయమున సుకుమారుని చరిత్రమును, 73 వ అధ్యాయమున శివదూత యమదూతల సంవాదమును నీ సందర్భితగ్రంథము నందలివిషయములు. దీనినిబట్టిచూడ బ్రహ్మోత్తరఖండము 70 అధ్యాయములకు మించినదియై యుండవలయును. ముద్రితమైన బ్రహ్మోత్తరఖండము 22 వ అధ్యాయములు కలదియేగాని తాళపత్రప్రతులలో 44 అధ్యాయములవఱకుఁ గల భాగము పరిషత్తునఁ గలదు. పోనీ, సుకుమారచరిత్రము బ్రహ్మోత్తరఖండమునందలి 24 వ అధ్యాయమే యనుకొందమన్నఁ దాళపత్రప్రతిని బరికింప నందలి 24 వ అధ్యాయమందలి విషయమును, నీయధ్యాయమందలి విషయమును వేఱువేఱుగఁ గన్పట్టుచున్నవి. ఇఁక ఈశానసంహిత యను సంహితప్రత్యేకముగనుండి, యందలి 24 వ అధ్యాయము ఈ సుకుమారచరితమై యుండవలయును. ఇట్టి యూహకు ప్రాచ్యలిఖిత పుస్తకభాండాగారమునందలి శిథిలమైన యీ కాగితములే నిదర్శనములని తలంచుచున్నాఁడను.

కథ సరిపడుచున్నదని యూహించికాఁబోలు శ్రీ ప్రభాకర శాస్త్రిగారు పై 3 అధ్యాయములకు ఈశానసంహిత యను నామమిడినారు. స్కాందాంతర్గత షట్సంహితలలో 'శంకరసంహిత' అను సంహిత ఈ యీశానసంహిత యగునేమో పరికింపవలసియున్నది. కావున విమర్శకులు శివరాత్రిమాహాత్మ్యమునకు మూలమయిన ఈశానసంహిత ముద్రితమైన యీమూఁడధ్యాయములేయని భావించితుష్టిసందక స్కాంద సంహితల బాగుగఁ బరిశీలించి యేనాఁటికైన సమగ్రమైన యీశాన సంహిత నరసెదరు గాక యని ప్రార్థించుచున్నాఁడను.

సర్వజ్ఞసింగభూపాలుఁడు.

శ్రీనాథునిచే సందర్శింపఁబడిన యీసర్వజ్ఞసింగభూపాలుని నిర్ణయమును గూర్చియు నాతనికాలనిర్ణయమును గూర్చియు శ్రీప్రభాకరశాస్త్రిగారు శృంగారశ్రీనాథమున విపులముగఁ జర్చించి తమ యభిప్రాయమును విశదముగ వెల్లడించియున్నారు. కాని, యానిర్ణయప్రసంగమునఁ బూర్వోత్తరగ్రంథవిరోధము గాన్పించుచున్నది. ఆ సంవిధాన మిట్లున్నది.

"భోగినీదండకమున సీమంతినీమానసారామవాటీవసంతున్, వసంతావనీనాథసంసేవితాంచత్పదాంభోజు రావుసింగక్షమానాథుపౌత్త్రున్ సర్వజ్ఞసింగోర్వరాధ్యక్షు..." అని కలదు. రేచర్లవారి వంశచరిత్రలందు "ఈ సర్వజ్ఞసింగభూపాలుఁడు సరిగా గుర్తింపఁబడుచున్నాఁడు. ఈతఁడే శ్రీనాథునిచే దర్శింపఁబడినవాఁడు. షష్ఠప్రకరణమం దీవిషయము విపులముగఁ జర్చింపఁబడును" అని శృంగారశ్రీనాథము ప్రథమప్రకరణము 41 వ పుటలో వ్రాసియున్నారు. ఈవాక్యముల ధోరణినిబట్టిచూడ, ప్రథమప్రకరణము రచియించునాఁటికే శ్రీనాథునిచేఁ జూడఁబడిన సర్వజ్ఞసింగభూపాలునిఁ గూర్చిన నిర్ణయము వారి మనమున స్థిరపడినట్లు తోఁచుచున్నదిగదా !

వారే తృతీయప్రకరణమున 72 వ పుటలో పెదకోమటి వేమభూపాలునిఁ గూర్చి ముచ్చటించుచు నీక్రిందివాక్యములను బొందుపఱచినారు. "రాచకొండ రాజధానిగా రాజ్యమేలిన వెలమరాజులకును కొండవీటి రెడ్డిరాజులకును ప్రబలవిరోధమని ముందే చెప్పితిని. వారొండొరులను మీఱి కీర్తి ప్రతాపయశస్సుల నార్జింపయత్నించుచుండిరి. రాచకొండ వెలమరాజు సర్వజ్ఞబిరుదమందఁగా, కొండవీటి రెడ్డిరాజు సర్వజ్ఞచక్రవర్తి బిరుదమందెను. వారు రసార్ణవసుధాకరాదిగ్రంథకర్తలైరి. వీరు వసంతరాజీయ సాహిత్యచింతామణ్యాది గ్రంథకర్తలైరి. వారు సంగీతసాహిత్యచతురులు. వీరు సంగీతసాహిత్యచతురులు. వారు కృతిపతు

లు. వీరు కృతిపతులు. వారు బహుపండితుల నాదరించిరి. వీరు బహు పండితుల నాదరించిరి."

ఇట శాస్త్రిగారి మతమున వేమభూపాలునకు సింగభూపాలునకు సర్వవిధముల సామ్యము కుదిరినది. రసార్ణవసుధాకరకర్తకు సర్వజ్ఞబిరుద మున్నట్లు స్థిరపడినది. కోమటి వేముఁడు, తన సమయమునకే వెలమ రాజులకు సర్వజ్ఞబిరుదము కలుగుటచేఁ దాను సర్వజ్ఞచక్రవర్తిబిరుదము నందినాఁడని చెప్పు నపుడాతని సమకాలికుఁడగు సింగభూపాలుఁడుసర్వజ్ఞ బిరుదాంచితుఁడని శ్రీ శాస్త్రిగారును నొప్పుకొనినట్లే యయినది. కాని షష్ఠప్రకరణమున "ఈసింగభూపతికి సర్వజ్ఞబిరుదము కానరాదు. రసార్ణవసుధాకరమున లేదు. చమత్కారచంద్రికలో లేదు. అమరవ్యాఖ్యలో లేదు. ప్రాఁతవ్రాఁతలలో నెక్కడను లేదు.....మీఁది పరిశోధనల వలనఁ దేలినసారాంశమిది. రసార్ణవసుధాకరకర్త సింగభూపతియు శ్రీనాథునిచే దర్శింపఁబడిన సింగభూపతియు భిన్నులు. మొదటివానికి సర్వజ్ఞబిరుదము లేదు. వా రిరువురును తాతామనుమలు. తాత,శక. 1320 ప్రాంతమునను, మనుమఁడు శక. 1370 ప్రాంతమున నున్నవార గుదురు'' అని సిద్ధాంతమును దేల్చియున్నారు. వేమభూపాలుని సమయమునకు మనుమఁడగు సింగభూపాలుఁడు లేనట్లు వారు నిశ్చయించియే యున్నారుగదా. ఆతని సమయముననున్న సింగభూపాలుఁడు, రసార్ణవసుధాకరకర్తయగు సింగభూపాలుఁడే. ఆతనికి సర్వజ్ఞబిరుదము కలదని తృతీయప్రకరణమునను, లేదని షష్ఠప్రకరణమునను పైవ్రాఁతలలోఁ దెలిపిన ట్లయినది.

చమత్కార చంద్రికలో లేదనుటయు, అమరవ్యాఖ్యలో లేదనుటయు సాహసమాత్రమే. ఆరెండు గ్రంథములలో రసార్ణవసుధాకర కర్తకు సర్వజ్ఞబిరుదమున్నట్లు వెనుక నేను దెలిపియే యున్నాను.*

---

*చూ. పరిషత్పత్రిక. సం. 30. సంచిక ౨. ౩.

వేమభూపాలుఁడు జీవించియున్న సమయమున రసార్ణవసుధాకర కర్త లేఁడనుటకుఁ దగిన శాసనాద్యాధారము లేదు. రసార్ణవసుధాకరము నందలి యీ క్రింది శ్లోకము,

"అథ శ్రీసింగభూపాలో దీర్ఘాయు ర్వసుధామిమాం
నిజాంసపీఠే నిర్వ్యాజం కురుతే సుప్రతిష్ఠితామ్."

తత్కర్త యానాఁటికి జీవించియున్నాఁడనియే తెలుపునదియై యున్నది. కావునఁ బూర్వోత్తరవిరుద్ధములయిన శ్రీశాస్త్రిగారి వ్రాఁతల ననుసరించి రసార్ణవసుధాకరకర్తకు సర్వజ్ఞబిరుదము లేదని, శ్రీనాథుని చే సందర్శింపఁబడిన యాతఁడు మనుమఁడేయని నిర్ణయింపక, రసార్ణవసుధాకరకర్తయగు సింగభూపాలునకు సర్వజ్ఞబిరుదమున్నట్లు తెలియుచున్నది గాన శాసనాదులింకను బరిశీలించి తాత సింగభూపతినే శ్రీనాథుఁడు దర్శించి యుండెనని నిర్ణయించుటకుఁ దగిన పరిశోధనలు గావించెదరుగాత మని పాఠకులకు సవినయముగ నివేదించుకొనుచున్నాఁడను.

ఏకశిలానగరము.

ఏకశిలానగర మన 'ఓరుగల్లా' 'ఒంటిమిట్టయా' యని చిరకాలము క్రిందట కీ. శే. వావిలకొలను సుబ్బారావుగారికిని, కీ. శే. జయంతి రామయ్యపంతులుగారికిని వాదోపవాదములు జరిగినవి. సిద్ధాంతములు స్థిరపడినవి. ప్రసిద్ధులైన విమర్శకు లందఱు తమతమ యభిప్రాయములను వెలువఱిచిరి. ఏకశిలానగర మన ఓరుగల్లే యనుసిద్ధాంతము బహుపండితసమ్మతమై స్థిరపడినది. చరిత్ర పరిశోధకులకు నాఁటికి నేఁటికి ఓరుగల్లనుటకే యాధారము లెక్కువుగఁ గానవచ్చుచున్నవి

ఇట్లుండ నీ నడుమ 'శ్రీ వావిళ్ల వేంకటేశ్వరశాస్త్రి'గారి సన్మానసంపుటములో బ్రహ్మశ్రీ జనమంచి శేషాద్రిశర్మగారు 'రాయలసీమ కవులు'అను వ్యాసమును బ్రకటించియున్నారు * అందు పోతన్న నొంటిమిట్టనివాసినిగా స్థిరపఱిచినారు. కాని యీ వాదోపక్రమము నాఁటికి

* చూ. సన్మానసంపుటము. రాయలసీమకవులు. పుట ౧౫౩-౧౫౫.

వెలువడని కొన్ని గ్రంథములు తరువాత వెలువడియుండుటచే నీవిషయమునఁ గొంత వ్రాయఁ బ్రసక్తి గలిగి యుపక్రమించుచున్నాఁడను.

కీ. శే. కొమఱ్ఱాజు లక్ష్మణరావుగారు పై యుభయులవాదములను బాగుగ విమర్శించి ఏకశిలానగర మోరుగల్లే యని సిద్ధాంతీకరించుచుఁ బదిప్రమాణములను దెలిపియున్నారు.† అందయిదవ ప్రమాణము క్రీడాభిరామమున ఏకశిలానగర మోరుగల్లని పద్యముల ముద్రితమైయుండుట. ఈ కావ్యము శ్రీనాథకృతమో లేక పరిష్కృతమో యయి యుండుటచే నీప్రసంగమున నా పద్యముల నుదాహరించుచున్నాఁడను.

ఉ. మంచన వింటివో వినవొ మన్మథుఁ డేకశిలాపురంబులోఁ
జంచలనేత్రలం బతుల శయ్యలపై రతికేళి రాత్రి పో
రించి ప్రభాతకాలము పరిస్ఫుటమైనను ధర్మదార వ
ట్టించుచు నున్నవాఁ డదె కుటీగతకుక్కుటకంఠనాళమున్.

క్రీడా. పుట. 18. (ప్రభాకరశాస్త్రిగారిచేఁ బరిష్కృతము.)

శా. ఓరుంగంటిపురంబు సౌధములపై నొప్పారెడిన్ జూచితే
యీరెండల్ మణిహేమకుంభములతో నేకాంతముల్ సేయుచున్
స్వారాజప్రమదాఘనస్తనభరస్థానంబులం బాసి కా
శ్మీరక్షోదము ప్రాణవల్లభదృఢాశ్లేషంబునన్ రాలె నాన్.

క్రీడా. పుట. 20.

పై రెండుపద్యములు గలిసి ఏకశిలానగర మోరుగల్లే యని స్థిరపఱుచునవియేగదా ? మఱియు నీ వాదము బయలుదేఱునాఁటికి ముద్రితము గాక, తరువాతఁ బరిషత్తుచేఁ బ్రకటింపఁబడిన సింహాసనద్వాత్రింశిక (కొఱవి గోపరాజకవి ప్రణీతము) యందును నీ సిద్ధాంతము స్థిరీక

---

† చూ. లక్ష్మణరాయవ్యాసావళి. 'ఏకశిలానగర మోరుగల్లే' అను వ్యాసము. పుట ౭౩-౭౪.

రింపఁబడినది. ఇంతియగాక గోదావరీనదికి 'గంగ' యనుపే రానాఁటికి వాడుకలో నున్నట్లు గూడ నాకవినోటనే వెలువడినది. చూడుఁ డా పద్యములు.

చ. ఆ కడ నీతిశాస్త్రవిదుఁడై గురు పీడ్యాని యేఁగె
గాకి తమూాలశక్తి గనిగా నొనరించిన పైఁడిచట్టు నా
నేకశిలాభిధానమున నెన్నిక కెక్కు ధరిత్రిలోన నే
ప్రోకలఁ బోనియట్టి సిరిపుట్టినయింటికి నోరుఁగంటికిన్.

సిం. ద్వా. ౧. ఆ. ౧౧౬ ప.

ప్రామాణికకవిశిఖామణి యగు నీ గోపరాజకవియు నించుమించు శ్రీనాథుని కాలమువాఁడు బహువిశేషజ్ఞుఁడైన యీతఁడు యేకశిలానగర మోరుగల్లే యని విస్పష్టముగఁ దెలిపియున్నాఁడుగదా? మఱియు

"క. ఆతఁడు త్ర్యంబకశిఖరో
ద్భూతను విఖ్యాతఁ బరమపూతఁ ద్రిలోకీ
మాత మహాపాతకసం
ఘాత విఘాతానుయాతఁ గనియెన్ గంగన్."

సిం. ద్వా. ౧. ఆ. ౧౬౦. ప.

ఇట్టితఁడు గోదావరిని గంగ యని పేర్కొనినాఁడు. త్ర్యంబకశిఖరోద్భూతయు, ఓరుఁగంటిసమీపమున నున్న 'గంగ' గోదావరి యనుట లో సంశయింప నక్కఱలేదుగదా?

ఇట్లు ప్రాచీనులు నర్వాచీనులు నగు కవిశేఖరులు నానాఁటిప్రసిద్ధినిఁబట్టి ఏకశిలానగర మోరుగల్లని నిర్ధారితముగఁ జాటుచుండ, శాసనాద్యాధారములు వేనోళ్ల నీసిద్ధాంతమును స్థిరీకరించుచుండ, వాదోపవాదములు ముగిసియుండ, తిరిగి 'ఒంటిమిట్ట' యనుట యెట్టులో పాఠకులర సెదరుగాక యని ప్రార్థన.

తాటియాకులత డపులాటల్లు.

చిలుకూరి పాపయ్యశాస్త్రి, మేనేజరు:- పరిషత్తు.

అం బా వి లా స ము.

శ్రీ దేవీస్తోత్రపరమగు నీసంస్కృతగ్రంథము 105 శ్లోకములుగల శతకము. శైలియందును భావగాంభీర్యమునందును, మంత్రశాస్త్ర రహస్యప్రతిపాదనమందును శ్రీశంకరభగవత్పూజ్యపాదవిరచితసౌందర్య లహరిని బోలియున్నది. ఈశతకమును రచియించిన కవివరేణ్యుఁడు విద్యావిలాసార్ణవుఁడను భువనానందనాథుఁడు. 'విద్యావిలాసార్ణవ' అనునది బిరుదవాచకము కానోపును. ఈతఁడు విజ్ఞానానందనాథగురు వరేణ్యుని శిష్యుఁడు.

శ్లో. విజ్ఞానానన్దనాథాహ్వయగురుకరుణాసాక్షితో...ద్య
 ద్వాణీ శృంగారలీలావలయితకవితావైభవే నావృతేన
 నామ్నా విద్యావిలాసార్ణవ ఇతి భువనానందనాథేన సమ్యక్
 స్తోత్రం సంపూర్ణమాసీత్ కృత మఖలమనోరమ్య మంబావిలాసమ్.

ఈ యంబావిలాసమున, పరాంబికావిలాసము సమగ్రముగా వర్ణింపఁబడినది. "వన్దేఽహం భవదీయదివ్యచరణద్వంద్వం పరాదేవతే" అనునది యీ శతకమున కంతకును మకుటము.

ప్రారంభము:—

శ్లో. శ్రీ విద్యే చరణారవిందయుగలధ్యానక్రియావేదినాం
 భక్తానాం విదుషాంచ కల్పలతికే మాయాకలామూలికే.
 సృష్టిస్థిత్యుపసంహారాది వివిధన్యాసక్రియాశోభితే
 వన్దేఽహం భవదీయ దివ్యచరణద్వన్ద్వం పరాదేవతే.

శ్లో. పీయూషార్ణవ మధ్యకల్పితమణిద్వీపే కదంబద్రుమైః
మందారైః కుసుమాన్వితైః పరివృతే రత్నాలయే చావ్యయే
ఆనందామృతవాటికాంతరగతే మంచే శివాఙ్కస్థితే
వన్దేహం

శ్లో. భ్రూమధ్యే ద్విదలాంబుజే గురుమయస్థానేచ హంసాన్వితే
మాణిక్యద్యుతిపాటలాయితదలై ర్యుక్తే చతుష్షష్టిభిః
తత్సంస్థితదేవతావలయితే తత్కర్ణికాంతస్స్థితే
వన్దేఽహం భవదీయ దివ్యచరణద్వంద్వం పరాదేవతే.

శ్లో. బ్రహ్మస్థానసరోరుహే దశశతైః పత్రైస్సువర్ణై ర్యుతే
మాలామంత్రనియంత్రితాభి రఖిలాభి ర్దేవతాభి ర్వృతే
తేజోరాశిమయే సుధాస్పదపదే తత్కర్ణికాసంస్థితే.
వందేఽహం భవదీయ దివ్యచరణద్వంద్వం పరాదేవతే.

తుదిశ్లోకము: —

శ్లో. ప్రాతఃకాలే దినాంతే కృతజపసమయే స్తోత్రమేతన్నిశాయామ్
భక్త్యా సత్కర్మనిష్ఠా యతిగురువచనా దీక్షితం యే పఠన్తి
వాక్సిద్ధిం మంత్రసిద్ధిం సుమధురకవితానాట్యగానాదిసిద్ధిం
స్త్రీవశ్యం రాజవశ్యం లభతి పరముఖస్తంభనం మోహనంచ.

ఈ గ్రంథము 8 పత్రములలో వ్రాయఁబడినది. పత్రములు మంచిస్థితిలో నున్నవి. వ్రాఁత బాగున్నది. తప్పులంతగలేవు. శ్రీవిద్యోపాసకుల కీగ్రంథ మవశ్యపఠనీయము. ముఖ్యముగ నాముష్మికార్థసంధాయకము. మంత్రాక్షరగ్రథితముగాన గురుముఖమున నుపదేశముఁ బొందినఁగాని పఠించుట యుక్తము గాదని యీ శ్లోకములలోఁ దెలుపఁబడినది. ఫలశ్రుతిని బురస్కరించుకొని పాఠకు లన్యథాభావింపకుండెదరుగాక.

శ్రీకృష్ణకర్ణామృతాధ్యాత్మవార్త్తికము.

శ్రీకృష్ణకర్ణామృతమును రచియించిన శ్రీకృష్ణ లీలాశుకయోగీంద్రుఁడు కేరళదేశీయుఁడని సోపపత్తికముగ నిరూపించుచు శ్రీయుత మానవల్లి రామకృష్ణకవి ఎమ్ ఏ గారు దుందుభి సంవత్సరపు టుగాది సంచికలోని "పుష్పాంజలి శ్రీకృష్ణలీలాశుకకవి" అను వ్యాసమును బ్రకటించియున్నారు. శ్రీ కవిగారు దెలిపినటులు లీలాశుకుఁడు కేరళదేశీయుఁడే యనుటకుఁ గొంతవఱకు నీవార్త్తికగ్రంథము సహకారమగునేమోయని నాయూహ. ఏమందురా? ఈవార్త్తికమును రచియించిన కవివతంసుఁడును కేరళదేశీయుఁడే.

ఇఁక నీ 'కృష్ణకర్ణామృతాధ్యాత్మవార్త్తిక' మను సంస్కృతగ్రంథము పరిషద్భాండాగారమున 3501 సంఖ్యగలది. 39 పత్రములుగలది. పత్రములు 19×1 ప్రమాణముగలవి. పుట కయిదు పంక్తులు గలవు. వ్రాఁత చక్కఁగ నున్నది. తప్పులు లేవు వ్రాయసగాని పేరు లేదు. తుదిపత్రమున ఇతి శ్రీమత్పరమహంస పరివ్రాజకాచార్య శ్రీశంకర భగవత్పాదకృత శ్రీమచ్ఛారీరకమీమాంసాభాష్యావర్త్తన నిరతేన చిదాభాస చిత్స్వరూప నరనారాయణభక్తేన శ్రీరాఘవేంద్ర సరస్వతీశిష్యేణ కేరళీయేన బాలగోపాలేంద్ర యతీంద్రేణ కృత మిదం కృష్ణకర్ణామృతాధ్యాత్మవార్త్తికం బోధామృతం సంపూర్ణం." అనికలదు. దీనిచే నీవార్త్తికకర్త కేరళదేశీయుఁడును రాఘవేంద్ర సరస్వతి శిష్యుఁడును, శ్రీకృష్ణభక్తుఁడును, అద్వైతానుసంధాన పరాయణుఁడనియుఁ దెలియుచున్నది. శ్రీకృష్ణకర్ణామృతము కేరళదేశమునందే ప్రథమమున నుదయించి ప్రచారముఁ గాంచియుండుట చేతను, అద్వైతానుసంధానపరాయణులకాస్వాద్యమగుట చేతను నీకేరళదేశీయుఁడగు యతీంద్రుఁడు శ్రీకృష్ణుని శృంగారచేష్టల కద్వైతపరముగ నర్థమును దెలుపు నీవార్త్తికగ్రంథమును రచియించియుండనోపు.

ఈవార్త్తికములు శ్లోకరూపములు. కర్ణామృతమునందు మూఁడు శతకములవలె నిందును మూఁడు ఖండములు. ప్రథమఖండమున 286 శ్లోకములు, ద్వితీయఖండమున 123 శ్లోకములు. తృతీయఖండమున 117 శ్లోకములునుగలవు. కర్ణామృతమునందలి శ్లోకములప్రతీకలఁ గైకొని, ఒక్కొకచో నొకశ్లోకమునే రెండుమూఁడునాలుగైదుశ్లోకములచే వివరించుట గలదు. అడుగడుగునకు నద్వైతసిద్ధాంత రహస్యములను వర్ణించుచుండును. శారీరక మీమాంసాభాష్య మావర్త్తించినవారికేగాని యీ తని వార్త్తికసార మవగతముకాదు. లీలాశుకుఁడు కృష్ణభక్తితరంగితుఁడై భగవానుఁడు తననోట నేది పలికించినాఁడో దానినే మధురముగ గానముచేసినాఁడు. ఈయతీంద్రుఁడును నట్లే యద్వైతానుసంధానపరాయణుఁడై కృష్ణపరమాత్మ తననోట నెద్దానిని బ్రవ్యక్తముచేయ నెంచినాఁడో దానినే దెలిపినట్లు యీక్రిందిశ్లోకము చాటుచున్నది.

శ్లో. కృష్ణం గురుం సర్వహృదేకసాక్షిణం
స్వాత్మానమీశం బహుశోఽపి నత్వా
తదీయకర్ణామృతవార్త్తికం ముదా
తత్ప్రేరితేన క్రియతే మ యేదమ్.

కృ. క. వార్త్తికమ్. ప్రథమఖండమ్. ౪.శ్లో.

శ్రీకృష్ణునిఁ బరమేశునిగాను, అతని లీలాసామగ్రిని జ్ఞానసామగ్రినిగాను దెలిపి యద్వైతరసామృతాస్వాదనముఁ జేయుట యీ కవివర్యునికిఁ బ్రధానలక్ష్యమై వెలసినది. కావున శ్రీకృష్ణుఁడు పరమాత్మస్వరూపుఁడైన యీశుఁడు, గోపికలు చిద్వృత్తులు, ఆగమాంతాధ్యేతలగు గొల్లలాత్మాహంకారవర్గము, వేణువు జ్ఞానము, నెమిలిపింఛము అమలమయిన జ్ఞానవిషయము, వేణుగానము బ్రహ్మవిద్య, గోవులు సమస్తమయిన యింద్రియములు నని నిరూపించి శ్రీకృష్ణుని వేణుగానవిలాసవిచేష్టిత మధ్యాత్మశాస్త్రార్థమని తెలిపి, యావిషయమునే తుదివఱకు సమర్థించినాఁడు. అప్రసంగము నిట నుదాహరించుచున్నాఁడను.

శ్లో. స్వాత్మాత్మైవై కృష్ణ ఈశో నిఖలవిమలచిద్వృత్తయో గోపికా హి
స్వాత్మాహంకారవర్గా స్సకలసుఖదగోపా స్వధీతాగమాన్తాః
వేణుర్జ్ఞానం సుపింఛం స్వవిషయ మమలం తత్ప్రియా బ్రహ్మవిద్యా
గావ స్సర్వేంద్రియాణి ప్రజయతి సకలాధ్యాత్మశాస్త్రార్థ ఏవమ్.

మచ్చున కొక శ్లోకమునకు వార్తికములు—

అస్తిస్వస్తరుణీః—

శ్లో. మాయాసంశుద్ధ సత్త్వోల్లసదభినవ చిద్వృత్తి సంస్కారముఖ్య
ప్రస్త స్వాభీష్టదం చిత్పరివృత మఖిలోత్కృష్ట మేవాత్మతత్త్వం
బ్రహ్మారబ్ధప్రశస్తోదిత నిగమశిరోవాగ్జవిద్యాబలోద్య
న్మోక్షానందం స్వపష్మం విమల మనుపమం సచ్చిదానందరూపమ్.

శ్లో. ప్రత్యగ్బ్రహ్మైక్యసిద్ధిగత చిదమలసంస్కార సందోహదత్తా —
న్ప్రమానంతాప్తి మోక్షాభయ మభిమతదం ప్రత్యగాకార మేకమ్
చిజ్జ్ఞంనాతిచ్యుతా చిత్పునవరగమసంరుద్ధ హృద్గ్రంథిభాస్వ
చ్చిద్వృత్తివ్రాత పర్యావృతి మమృతమజం నిత్య మస్త్వద్వితీయమ్.

ఇట్టి యద్వైతభావమును గాఢముగ వ్యక్తముసేయు వార్తికముల నీ బాలగోపాలేంద్రయతీంద్రుఁడు, శ్రీకృష్ణపరమాత్మ ప్రేరణచే లీలాశుకుని శృంగారాదిరససమంచిత శ్లోకములకు వ్రాయుటచే, లీలాశుకుఁడు యతీంద్రుఁడయి తన భక్తిపారవశ్యతను దెలుపుటకే శ్రీకృష్ణకర్ణామృతమును రచియించెనని సుస్పష్టముగ విదితమగుచున్నది. కావున నిట్టి యుత్కృష్టగ్రంథమును మననము చేయుట కృష్ణాద్వయానుసంధానపరాయణుల కావశ్యకమని విని వేదించుచున్నాఁడను.

తత్త్వసంగ్రహరామాయణము.

శ్రీరాముని పరతత్త్వప్రతిపాదకగ్రంథము. శ్రీమత్స్వయంప్రకాశానంద సరస్వతీపూజ్య పాదశిష్యులయిన శ్రీమద్రామబ్రహ్మానందస్వాములవారిచే నీగ్రంథము విరచింపఁబడినట్లు లీగద్యము తెలుపుచున్నది.

"శ్రీమత్ స్వయం ప్రకాశానంద సరస్వతీపూజ్యపాదశిష్య శ్రీమ ద్రామబ్రహ్మానందసరస్వతీస్వామివిరచితే. తత్త్వసంగ్రహరామాయణే బాలకాండ స్సమాప్తః."

శ్రీరాముని పరతత్త్వ మాయాపురాణములయందు వేర్వేఱు రీతుల వర్ణింపఁబడినది. కథాంశములయందును సంచించుక భేదము గాన వచ్చెడిని. శ్రీస్వాములవా రట్టి వివిధాంశముల నొకచోఁ జేర్చి, యనుగతిఁ గూర్చి, శ్రీరాముని బరమాత్మస్వరూపునిగా స్థిరీకరించుచు నీగ్రంథమును గూర్చినారు. పురాణముల నన్నిటిని జదివి యందలి సారమును గ్రహించుట దుస్సాధము. అట్లు బహుపురాణసమ్మతాంశములు దెలియక శ్రీమద్రామాయణమునందలి మహర్షివాక్యముల తాత్పర్యమును నిర్ణయించుట దుశ్శకము. కావున శ్రీమద్రామాయణ రహస్యవేత్తల కీగ్రంథ మత్యంతోపకారకము.

మల్లినాథసూరియు,

"తే బహుజ్ఞస్య చిత్తజ్ఞే పత్న్యౌ పత్యు ర్మహీక్షితః
చరో రర్ధార్ధభాగాభ్యాం తా మయోజయతా ముభే".

(రఘువంశము. ౧౦ సర్గ. ౫౬. శ్లో)

అను శ్లోకమునకు వ్యాఖ్యానము సల్పుచు, ఒకయంశమునందే విభిన్నగ్రంథముల విరోధము గానవచ్చినచో పురాణాంతరముల సహాయమున సమాధాన మరయవలెనని తెలిపినాఁడు. పాయసవిభాగము విషయమున కాళిదాస వాల్మీకుల యభిప్రాయ విరోధమును నారదపురాణోదాహరణముచే సమర్థించినాఁడు అట్టి సౌకర్య మీ తత్త్వసంగ్రహ రామాయణమునఁ గానవచ్చుచున్నది.

ఈప్రతి 1091 సంఖ్యగలది. తొలుతటిపత్రములు వాల్మీకి రామాయణమునందలి యుత్తరకాండము. ఆవెనుక 86 పత్రము లీతత్త్వసంగ్రహ రామాయణమునందలి బాలకాండము. పత్రము లటనటఁ గ్రిమిదష్టములైనను, ప్రతి మంచిస్థితిలో నున్నది. ఇదిగాక 230 సంఖ్యగల

ప్రతియును తత్త్వసంగ్రహరామాయణమే. ఆప్రతి తొలుతటి యిరువది పత్రములకు మొదటిభాగములు లోపించినది. అందు బాలకాండము మొదలుగ సుందరకాండము తుదివఱకును గలదు.

గ్రంథారంభము.

శ్లో. యోఽంతే సర్గాదేక ఏవాస పశ్చా
దేకం సంతం బహుధా యం వదన్తి
య స్సర్వజ్ఞ స్సర్వగ శ్శాంత ఏక
స్తం రామాఖ్యం దేవమాద్యం భజేఽహం. ౧

యత్పాదం భువనైకధామ విలస ద్విశ్వస్య నాభ్యుత్థితం
త త్క్రీడాకమలం విధాయ విహరం త్యన్యే వరా మే హియా
శ క్తిం తాం జగతాం క్రియాభి రనిశం సంక్రీడయన్తీం పరాం
సేవే తాం నిజలోకభాగ్యనివహాం సీతాభిధాం కామహం. ౨

గురుం వాణీం గణేశంచ నత్వా వ్యాసం శివం శివాం
వాల్మీకిం నారదాదీంశ్చ భజే రామకథావిదః
రామాయణే పురాణేషు సంహితా స్వాగమాదిషు
రామతత్త్వచరిత్రాదా విశేషా స్సన్తి భూరిశః. 3

ఏకత్రైవ విశేషాం స్తా నవగాహితు మిచ్ఛతాం
యత్ర యే యే విశేషాస్స్యుః తాంస్తా న్సంగృహ్య సారతః
ప్రసిద్ధార్థస్య సంకోచై రప్రసిద్ధార్థవిస్తరైః
శ్రీరామతుష్ట్యై ప్రాచీనై ర్మణిభి ర్మాలికామివ. ౪

శ్లోకై ర్నానాపురాణాదినిష్ఠై రేవ సకల్పితైః
కుర్వే రామాయణం తత్త్వసంగ్రహాఖ్యం మనోరమం ౫

ఇట్లు ప్రతిజ్ఞ చేసి, ధర్మఖండము, శ్రీమద్రామాయణము, సంహితలు, అధ్యాత్మరామాయణము, కూర్మ, పాద్మ, నారసింహ, బ్రహ్మ, బ్రహ్మాండ, స్కాందపురాణములు, భాగవతము, విష్ణుపురాణము. గారు

తాపిని, హిరణ్యగర్భసంహిత, శ్రీరామమంత్రకల్పము మున్నగువాని నుండి విషయము నంతను కృత్స్నముగ సంగ్రహించి సమకూర్చినారు. పాఠకుల కొకయంశము నుదాహరించుచున్నాఁడను.

త్రయోదశసర్గ ప్రారంభము:—

పార్వత్యువాచ:—

కో వా దశరథః ప్రోక్తః కౌసల్యా కా వను శంకర
భగవాన్కారణా ద్యస్మా త్తయో ర్జాతో వదస్వ తత్.

శివఉవాచ:—

స్వాయంభువో మనుః పూర్వం ద్వాదశార్ణం మహామనుం
జజాప వర్షసహస్రం నైమిశే గోమతీతటే
పూజిత స్తేన లక్ష్మీశః ప్రసన్నః కరుణానిధిః
మత్తో వరం వృణీష్వేతి తేనోక్తో మను రబ్రవీత్
పుత్త్రత్వం భజ దేవేశ త్రిషు జన్మసు మే హరే
త్వాం పుత్త్రలాలసత్వేన భజామి పురుషోత్తమ.

శ్రీభగవానువాచ:—

ఏవ మస్తు మనుశ్రేష్ఠ యత్తే మనసి కాంక్షితం
మమాపిచ మహాప్రీతి రాప్తుంతే పుత్త్రతామితి
స్థితి ప్రయోజనే కాలే తత్ర తత్ర జనిష్యసి
త్వయి జాతే త్వహమపి జనిష్యే తవ నన్దనః
రఘువంశే మనుఃపూర్వం జాతోదశరథ స్తతః
ద్వితీయే వసుదేవోఽభూ ద్వృష్ణీనా మన్వయేఽథసః
తృతీయేఽభూద్ద్విజః కశ్చిన్మను ర్విష్ణుప్రతాహ్వయః
కలౌ దివ్యసహస్రాబ్దే గ్రామే శంబళసంజ్ఞికే
ఏవం జన్మత్రయం కృత్వా ముక్త స్స్యా దంత్యజన్మని.

ఈరీతిగ సంశయాంశముల సహేతుకముగ విమర్శించి తత్త్వమును గరతలామలకముగఁజేయు నీరామాయణతత్త్వమును విజ్ఞులరసెదరుగాక.

మకరందరుఖరి.

కురలి రామపండితునిచే రచింపఁబడినది. అప్పయదీక్షిత విరచిత మయిన కువలయానందమున కీగ్రంథము వ్యాఖ్యానరూపము. వైద్య నాథసూరి రచియించిన 'చంద్రిక'యను వ్యాఖ్యానమునకు ఖండనగ్రం థము. ఈపండితుఁడగస్త్యగోత్రోద్భవుఁడును, ఆలంకారిక చూడామ ణియు,కవీంద్రుఁడు నని యాతఁడు రచియించిన యాటిప్పణీలహరుల తుది గద్యలవలనఁ దెలియుచున్నది. ఆవచనము లిట్లున్నవి.

ఇతి శ్రీమదగస్త్యగోత్రపవిత్ర కురలివంశమౌక్తికమణే ర్వాలం కారికచూడామణే రామసంఖ్యావతః టిప్పణీషు కువలయానన్దటిప్పణ్యాం మకరందఝుర్యాం ఉపమాదిశతార్థాలంకార వివరణం నామ ప్రథమా లహరీ.

ఇతి శ్రీమదగస్త్యగోత్రపవిత్ర కురలి వేంకటకృష్ణ పండిత రామ కవీంద్ర విరచితాయాం కువలయానందటిప్పణ్యాం రసవదాది పంచ దశాలంకారనిరూపణం నామ ద్వితీయా లహరీ.

ఇతి శ్రీమదగస్త్య గోత్రపవిత్ర కురలి వంశమౌక్తిక మణే రాలంకారిక చూడామణే...............కువలయానందటిప్పణ్యాం మక రందఝుర్యాం సంసృష్టినిరూపణం నామ తృతీయా లహరీ.

ఈపండితుఁడురచియించిన వేఱొక గ్రంథము 'దశరూపకవర్త్మ' గానగుచున్నది. ఈతనిపాండిత్యప్రతిభ గొప్పదని మకరందఝరి చాటు చున్నది. తర్కజటిలమైన చంద్రికావ్యాఖ్యాన మవగతము చేసికొనుటయే దుస్సాధము. అట్టితెటి నావ్యాఖ్యానమందలి దోషముల నుద్ఘాటనచేసి ఖండింపఁబూనుట యాతని యాలంకారికశిఖామణిత్వమును వ్యక్తము సేయుచున్నది.

ఇఁక నీప్రతి 1146 సంఖ్యగలది. పత్రములు 115. వ్రాఁత బాగు గనున్నది. తప్పులులేవు. పత్రములు క్రిమిదష్టములు. ఒండురెండు పత్ర ములతుదలు తునిఁగినవి. వ్రాయసగానిపేరు తెలియరాదు. గ్రంథము సమగ్రము.

గ్రంథారంభము :—

శ్రీరస్తు.

శ్లో. అన్యోన్యాదర వీక్షణ విస్మృమర శృంగారసార సర్వస్వం
తేజఃపరం శివాఖ్యం చిర మవతా న్మాం పురాణదాంపత్యం.
వందిత్వా తన్మహా శ్చంద్రచూడ మానందమందిరం
కుర్వే కువలయానంద మకరందరుఖీ మహం.

యద్య ప్యప్పయ సోమపీథికవిచంద్ర ... ...
కిమిహా స్తి మే కువలయానందే తథా ప్యాదరాత్
యస్మః కశ్చన కార్యఏవ ననుతం యద్వైద్యనాథోదితా
వ్యత్య స్తీకురుతే దురధ్వకలనై ర్వ్యాఖ్యామిమా చ్చంద్రికా.

తథాహి.

చంద్రాలోకా త్కువలయానందో ఽభూదితి నాద్భుతః
పరం కువలయానందాచ్చం ... ...

శ్లో. అతఏవ చకార వైద్యనాథో నిజకృత్యాహ్వవిపర్యయప్రమాదం
పరిహర్తు ముదారమూలరీతే ర్భత మన్యే విపరీత లేఖనాని.
తాని స్పష్టీకరిష్యంతే తత్ర తత్ర విభావ్యచ
విమత్సరం సహృదయా మాం నింద త్వథ నందతు.

అనఁగా కువలయానంద వ్యాఖ్యాతయగు వైద్యనాథసూరి విపరీతముగ వ్యాఖ్యానమొనర్చినాఁడు, ఆతని వ్యత్యాసముల నటనటఁ దెల్పెదను. సహృదయులు మాత్సర్యమువదలి పఠించి నిందించెదరుగాక; లేక ఆనందించెదరుగాక యని ప్రతిజ్ఞ సలిపినాఁడు.

శ్లో. సామాన్యలక్షణాన్వితమేవ గ్రాహ్యం విశేషలక్ష్మ తతః
నక్వాత్యతి ... ...లక్ష్మకించి ద త్రకృతం.
కావ్యప్రకాశముఖలక్షణ పారదృశ్వా
కల్యాణనవ్యబహుకావ్యవిధానచంచుః
సాహిత్యసారనిధి రప్పయదీక్షితీయ
వ్యాఖ్యా మిమాం కురలి రామకవి ర్విధత్తే.

ఈశ్లోక మీతఁడు, కవివతంసుఁడు సాహిత్యసారవేత్తయునని చాటుచున్నది. వ్యాఖ్యానరీతి దీనిని సమర్థించుచున్నది. 'చంద్రికా' ఖండన క్రమమును దెలుపుటకొఱకు కొన్ని వాక్యముల నీమకరందర్షునినుండి యుదాహరించుచున్నాఁడను.

"వస్తుతస్తు-'విశేష్యేణ స్వహైకార్థం భవేద్యత్ర విశేషణం
లింగసంఖ్యాదయః ప్రాయో విశేష్యస్థా విశేషణం."

ఇతికారికోక్తదిశా ఈశ్వరాదిపదానాం విశేషణవాచకత్వం వినా బుధాది పదసమానవిభక్తికత్వ...నావశ్యకత్వేన తదర్థమీశ్వరాది సదృశేలక్షణా. ఇవాది స్తాత్పర్యగ్రాహకః అన్యచబుధాదా వభేదాన్వయ ఇతిర మణీయః పంథాః. అత్రకుతర్కకర్కశారణ్యశరణ్యా చంద్రికాకారోక్త దూషణానా మయ ముద్ధారక్రమః. యదుక్తమివాదేర్ద్యోతకత్వే ఉపమాయా...తత్వంభజ్యేతేతి తన్న. ఇవాదేర్ద్యోతకత్వంవాభవతు వాచకత్వం. ఉభయథాపినసమీహితహానిః. యత స్తత్ప్రయోగే ఉపమాశ్రౌతీత్యేవ ఆలంకారికసమయః. కించశ్రౌతత్వం న శ్రుతశబ్దవాచ్యత్వం. తథాసతి "మన్యేశంకే ధ్రువం నూనంప్రాయ ఇత్యేవమాదిభిః. ఉత్ప్రేక్షా వ్యజ్యతే శబ్దై రివశబ్దోఽపి తాదృశః" ఇతికారిక యోత్ప్రేక్షా వ్యంజకత్వేన పరిగణితా ప్రయోగేఽపి తస్యావాచ్యత్వ దార్ఢ్యేన సార్వత్రిక గమ్యత్వాపత్తిః" ఇత్యాది.

ఇట్టి యీవ్యాఖ్యాన మాలంకారికుల కత్యంతాదరణీయము.

దశరూపకవర్త్మ.

కురలి రామకవి విరచితము. దశరూపకముల ప్రమేయమును సంక్షేపముగ నూటపది శ్లోకములందు వివరింపఁబడినది. ఈప్రతిసంఖ్య 4246. మూఁడు పత్రములలో నీగ్రంథ మిముడినది. పత్రములు క్రిమిదష్టములు. ఈప్రతియందు సిద్ధాంతకౌముదిలోఁ గొంతభాగము, లంబోదరప్రహసనము, ఉన్మత్తరాఘవమును వ్రాయఁబడినవి. మకరందర్షునీ

కర్తయే దీనిని రచయించుటచేతను, రూపకలక్షణ గ్రంథములలో నూత నముగుటచేతను నిటఁదెలుపఁ బ్రసక్తిగలిగినది.

గ్రంథారంభము.

శ్లో. అ...వ...గుణవారిధి మాన మ్యాత్మని సదాశివం దేవం
వృత్తిత్రప్రముదే కథయతి దశరూపకవర్త్మ కురలిరామకవిః,
యద్యపి పూర్వై కేత ద్వివృతం దశరూపకాదిషు తథాపి
వృత్తిత్రస్నా మస్మిన్ సుగమాయ పరం మమారంభః
సర్వైఃప్రతి...యస్యైస్సైవ రభినయై స్స్ఫుటం
సభా... నేతృచారిత్రరూపణా ద్రూపకం మతం.

తుదిభాగము :—

సంహారస్యాప్యత్ర శక్తిస్తు సభాశంసన మీరితం
దశోత్తరశతశ్లో కైర్దాశరూపకపద్ధతిః
దర్శితా సాధు కురలి కులక్షీరాంబుధీందునా
రామసంఖ్యావతా త్వర్థం ప్రీయతాం శంకరోఽనయా

రూపకక్రమము.

శ్రీరంగభూపాలవిరచితము. దశరూపకములకు లక్షణము దెలు పఁబడినది. రచయిత శ్రీరంగభూపాలుఁడు. తొలుత రూపకములయం దుపయోగించు పరిభాషనునిరూపించి, ఆవెనుక నాటకాదిలక్షణములను దెలిపినాఁడు.

తుదిశ్లోకము.

ఇత్థం శ్రీరంగభూపేన లక్ష్యలక్షణశాలినా
సర్వలక్షణసంపూర్ణం లక్షితో రూపకక్రమః.

గద్య :—ఇతి శ్రీరంగభూపాలీయే నాటకాదిదశరూపకాణాం లక్షణం సంపూర్ణమ్.

దశరూపకాదులయందు నిరూపింపఁబడని కొన్నిలక్షణవిశేష ముల నిందుఁగూర్చియున్నాఁడు. ఈతని కీరూపకలక్షణ నిరూపణమున

ప్రతిభావిశేషము గానవచ్చుచున్నది. ఏయేప్రకృతులం దెట్టి సంభాషణ ముచితమో యాయంశములను బాగుగవ్యక్తీకరించియున్నాఁడు. ఈప్రతిని 13 పత్రములుగలవు. వ్రాఁతమంచిది. పుటకొలుపంక్తులు వ్రాయఁబడినవి. వ్రాఁతతీరు ముద్దులు గుల్కుచున్నది.

గ్రంథారంభము :—

అథ రూపకనిర్మాణ పరిజ్ఞానోపయోగినీ
శ్రీరంగధరణీశేన పరిభాషా నిరూప్యతే
తత్ర భాషా ద్విధా భాషా విభాషా చేతి భేదతః
చతుర్దశ విభాషాస్స్యుః ప్రాచ్యాద్యా వాక్యవృత్తయః
ఆసాం సంస్కారరాహిత్యా ద్వివిధో నైవ కథ్యతే
ఉత్తమాదిషు తద్దేశవ్యవహారా త్ప్రతీయతాం
భాషా ద్విధా సంస్కృతా చ ప్రాకృతా చేతిభేదతః.
కౌమారపాణినీయాదిసంస్కృతా సంస్కృతా మతా ఇత్యాది.

నడుమ నొకఘట్టము :—

కథానాథాస్తు ధర్మార్థరసమోక్షోపయోగినః
ధర్మోపయోగిన స్తత్ర యుధిష్ఠిర నళాదయనః,
అర్థోపయోగి న స్తత్రనరసింహన్నృపాదయః
రసోపయోగినోవిద్యాధరవత్సేశ్వరాదయః
మోక్షోపయోగినో రామవాసుదేవాదయో మతాః.
కవయ స్తత్ప్రబంధార స్తే భవేయు శ్చతుర్విధాః
ఉదాత్త ఉద్ధతః ప్రౌఢో వినీత ఇతి భేదతః
అంతర్గూఢాభిమానోక్తి రుదాత్త ఇతి గీయతే
పరాపవాదా త్స్వోత్కర్ష వాదితోద్ధత ఉచ్యతే
యత్రో జితనిజోత్కర్ష వాదీ ప్రౌఢ ఇతీరితః

యుక్త్యా నిజోత్కర్షవాదీ ప్రౌఢ ఇత్యపరైః స్మృతః
వినతో వినయోత్కర్షా త్స్వాపకర్షప్రకాశకః.

అలంకారశిరోభూషణము.

ఇదియొక సంస్కృతాలంకారశాస్త్రగ్రంథము. ఆయలూరి కందాళార్యవిరచితము. ఈకవిదేశకాల చరిత్రాదికము కృత్యాదినిఁ దెలుపఁబడినది. ఆవిషయమును క్రమముగ నుదాహరించెదను. ఉపలబ్ధమయిన యీప్రతియందు 11 పత్రములు ప్రథమోల్లాసమును, 12 పత్రములు ద్వితీయోల్లాసమును, 14 పత్రములు చతుర్థోల్లాసమును, 8 పత్రములు పంచమోల్లాసమును, 5 పత్రములు షష్ఠోల్లాసమును, 5 పత్రములు సప్తమోల్లాసమును గలవు. ప్రథమమున కృతిపతిపతివర్ణనము అక్షరగణాది వివేకమును, ద్వితీయమున కావ్యలక్షణము, చతుర్థమున రసనిరూపణమును, పంచమమున దోషములు, షష్ఠమున గుణములు, సప్తమమున శబ్దాలంకారములును నిందలి ప్రమేయము. దృశ్యకావ్యవివేచనముగల తృతీయోల్లాసము, అర్థాలంకారస్వరూపమునుదెల్పు అష్టమోల్లాసమును నిందు లుప్తములు. ప్రతిసంఖ్య 3441.

ఈతని యుల్లాసాంతగద్య:—

ఇతి శ్రీమత్సకలకల్యాణ గుణగణపరిపూర్ణ కృష్ణా తుంగభద్రా మధ్యాధిష్ఠిత శ్రీబోరువెల్లినగర విహరమాణ శ్రీ కేశవస్వామి చరణ నలినయుగల సేవాధురీణతాభిరామ సోమభూపతి సతీలలామ గిర్యమ్మాంబాగర్భ క్షీరపాథోనిధి సుధాకరాయమాణ శ్రీవేంకటాద్రిస్వామి భృన్మహాస్థాన విద్వన్మహాకవినా కౌశికగోత్రతిలకేన శ్రీమదాయలూర్యన్వయ సముద్భవేన కందాళయార్యేణ విరచితే అలంకారశిరోభూషణ నామ న్యలంకార శాస్త్రే ప్రథమోవిలాసః.

ఈకవివతంసుని యలంకారశాస్త్రపాండిత్యము మంచిదిగానే కానఁగును. ఇతరశాస్త్రప్రమేయమును నీతనికి గోచరముగనట్టు లితని

రచన దెలుపుచున్నది. ఉదాహరణమునకై కొన్ని వాక్యములఁ జూపెదను.

శ్లో. శబ్దార్థౌ నిర్దోషౌ కావ్యం సగుణావలం క్రియావంతౌ" దోషరహితం గుణాలంకార వంతౌ శబ్దార్థౌ కావ్యమితి కావ్యసామాన్యలక్షణం. "నచ'యః కౌమారహరస్సఏవహివరస్తా ఏవచైత్రక్షపాః"...'ఇత్యాదా వవ్యాప్తిః. అలంకారశబ్దేన అలంకారాత్యంతానధికరణత్వస్య వివక్షితత్వాత్ అత్రాలంకార స్యాస్ఫుటత్వేఽపితత్సం భావనాయా స్సత్త్వాత్.నహ్యస్ఫుటత్వ మాత్రే ణాభావ ఆపాద్యతే. తస్మాద్యథా కథంచి త్సాలంకారస్యైవ కావ్యత్వమితిసిద్ధం. నను కావ్యప్రకాశికాయాం, 'తదదోషౌశబ్దార్థౌ సగుణావనలంకృతీపునః క్వాపి'. తిక్వచిదనలంకారస్యాపికావ్యత్వముక్తం,అతోవిరోధ ఇతిచేన్నైవం. అనలంకృతీ ఇత్యత్ర అనుదరా కన్యేత్యాదావివ ఈషదర్థకత్వస్య వివక్షితతయా ఉక్తార్థ లాభాత్-నచ నఞః ఈషదర్థ కత్వ మప్రామాణికమితి వాచ్యం 'తత్సాదృశ్యమభావశ్చతదన్యత్వం తదల్పతా. అప్రాశస్త్యంవిరోధశ్చ నఞర్థాః షట్ప్రకీర్తితాః"

ఇతి వచనస్యైవ ప్రమాణత్వాత్ :—

లక్షణములను లక్ష్యములను స్వయముగ రచియించియున్నాఁడు. రంగేశున కంకితముఁజేసినశ్లోకములనుదాహృతులకుఁగైకొనియున్నాఁడు. కవితాధారయు సరసముగనే యున్నది.

తెలుఁగు ప్రబంధములయందలి కృత్యాదిపద్యముల తీరెట్లుండునో యీయలంకారగ్రంథమునందలి యుపక్రమ మట్లేయున్నది. విస్తృతమైనను పాఠకులకీక్రమమును దెలియఁజేయఁ గుతూహలినై ప్రదర్శించుచున్నాఁడను. ఈప్రసంగమునఁ గృతికర్తృ కృతిభర్తలనుఁ గూర్చి కృత్స్నముగఁ దెలియఁగలదు.

కృత్యాది :—

శ్లో. కందాళ దొడ్డయాచార్యచరణౌ శరణం వృణే
యన్నతౌ కవితాగంగాలహరీ విహరిష్యతి.
అతిశయోఽస్తి మంహాంశ్చమహాగురో
శ్చరణయో రనయో స్సరసీరుహాత్
భవతి తత్స్వయమేవ గృహంశ్రియః
పరమి...తనుత స్స్వసమాశ్రితాన్.
సకలజనాంతర్యామీ సదృశవయోరూపగోపికాగామీ
కలయతు కమలాకామీ కరుణాం మయి భూరి కేశవస్వామీ.
జయతి కిల కులం తజ్జన్మ యస్యావిరాసీ
త్పరమపురుషపాదే బ్రహ్మరుద్రాదిపూజ్యే
సురమునిగణసేవ్యా సోదరీ యస్య గంగా
క్షితిరపి సుపవిత్రా క్షేమదా ప్రాణభాజాం.
తస్మి న్కార్షీవలం వర్ణం సువర్ణమివ శుశ్రుమ
వర్ణోత్కర్షశ్చ కుత్రాపి పాకాతిశయతః పరం.
దేశోఽపి పాకనాడీతి విఖ్యాతో లోకపుణ్యపరిపాకాత్
తత్ర మిటిమిల్లగోత్రం ప్రాప్తమభూ ద్భూమిగోత్రరాజత్వం.
తస్య మిట్మిల్లిగోత్రస్య మహిమా వాగగోచరః
యత్ర శ్రీవేంకటక్ష్మాభృన్ముఖా జాతా మహీభృతః.
దేవాభూవలయే జనావనరతాః పుణ్యైరగణ్యైస్స్థితాం
కర్తుం స్వస్వపదస్థితిం విధి ముపేత్యాభ్యర్థయన్ స్వాస్వయం
తత్సంగృహ్యైకు - సోపి సకలం సారం యతో ముష్టినా
యద్వంశం వ్యతనోత్స భాతి వితరాం తన్ముష్టిపల్ల్యాఖ్యయా

ఇత్యాది.

లక్షణదీపిక - గౌరన.

వ్యాకరణవిద్యాప్రవీణ, విద్వాన్, చిలుకూరి పాపయ్యశాస్త్రి.

ఆంధ్రమున 'హరిశ్చంద్రచరిత్రము, నవనాథచరిత్రము' అను సుప్రసిద్ధములయిన ద్విపదకావ్యములను రచియించిన గౌరనయే యీ 'లక్షణదీపిక' అను సంస్కృతచ్ఛందోగ్రంథమును రచియించిన కవివరేణ్యుఁడు. ఈతఁడు తొలుత నీలక్షణదీపికను, ఆవెనుక హరిశ్చంద్రచరిత్రమును, పిమ్మట నవనాథచరిత్రమును రచియించిన ట్లీక్రింది వాక్యముల వలనఁ దెలియుచున్నది.

హరిశ్చంద్రచరిత్రము ప్రారంభమున "సరససాహిత్యలక్షణవిచక్షణుఁడ" అనియు, తుదిని

"భ్రమరాంబాప్రసాదసంప్రాప్తకవిత్వ
సుమహితసామ్రాజ్యసుఖపరాయణుఁడు
చతురసాహిత్యలక్షణచక్రవర్తి"

అని తన్నుఁగూర్చి యీతఁడు తెలుపుకొనియున్నాఁడు. వివిధ సాహిత్యగ్రంథములందలి ప్రయోగములతోఁగూడిన యీలక్షణగ్రంథ నిర్మాణముననే యీతని కిట్టి లక్షణచక్రవర్తిత్వము స్థిరపడియుండు ననుట నిర్వివాదము.

ఇఁక నవనాథచరిత్రారంభమున—

"ఇప్పుడుగల సుకవీంద్రులలోన
సరససాహిత్యలక్షణవివేకముల
సురుచిరమధురవచోవిలాసముల
గుణశీలములను సద్గుణకలాపముల
నలవడ్డవాఁ డెవ్వఁడని విచారించి"

తన్ను రావించెనని తెలిపెను. ఇట్లనుటచే నవనాథచరిత్రమును నిర్మించునాఁటి కీతనికి లక్షణదక్షతయు సురుచిరకావ్యనిర్మాణచాతురియు

నలవడినట్లు విదితమగుటచే నట్టి ప్రసిద్ధి సుప్రసిద్ధహరిశ్చంద్రచరిత్రమును రచించుటవలననే కలిగియుండె ననుకొనవచ్చును. కావున నుపలబ్ధమై నంతవఱకు పాతనికృతులలోఁ దుది గ్రంథము నవనాథచరిత్రమును, తొలుతటిది లక్షణదీపిక యనియు మనము దెలిసికొన నగుచున్నది.

నేఁటివఱ కీలక్షణదీపిక ముద్రితముగాలేదు. విమర్శకు లందఱు నిందలివిషయముల నుదాహరించునపుడు వ్రాఁతప్రతుల నూఁతగఁ గొని యున్నారు. గౌరనకాలనిర్ణయాదికమున కీగ్రంథము మిక్కిలి తోడ్పడు నధిక మున్నది. ఆవిషయమును గ్రమముగఁ దెలిపెదను. కాని ముం దుగ గ్రంథమాతృకలనుగూర్చి కొంత వివరించెదను.

ఖరిమద్భాండాగారమున 'లక్షణదీపిక' తాటియాకుప్రతులు రెండు గలవు. అం దొకటి 2585 సంఖ్యగలది. రెండవది 1391 సంఖ్యగలది. రెండును సమగ్రములే. ఇందలివిషయములను దెలుపునపుడు క్రమముగ వీనిని 'క' 'గ' ప్రతులని వ్యవహరింతును. ఈప్రతులందలివిషయములకుఁ బోలికలు మార్పులు పెక్కులు గలవు.

రెండిటికిఁ గలపోలికలు.

1. శ్లో. ఏపా లక్షణదీపికా విజయతే విద్వజ్జనానన్దినీ
ఛన్దోఽలంకరణాద్యనేకవివిధగ్రంథప్రయోగాన్వితా
గర్వాఖర్వకుతర్కకర్కశకవిగ్రీవాస్పదా సంశ్రిత
వ్యాళీ సత్కవిరాజకల్పలతికా కల్పాంతరస్థాయినీ.
అను నీశ్లోకము తుదిని రెండిటను గలదు.
2. లక్షణస్వరూపమును దెలుపు వాక్యములును, ఉదాహరణశ్లోకము లును గొన్నిపట్టుల రెండిట నొకరీతిగనున్నవి.
3. రెండిటఁ జేర్కొనిన లక్షణగ్రంథములు కొన్ని తుల్యముగ నున్నవి.
4. చాలవఱకు ఛందోవిషయములు సమముగ నున్నవి.
5. లక్షణస్వరూపనిర్ణయము రెండిట సంస్కృతభాషయం దున్నది.

రెండిటికిఁ గలభేదములు.

1. ఉపక్రమోపసంహారములు వేర్వేఱుగఁ గన్పట్టుచున్నవి. అనఁగా 'క' ప్రతికిఁ బ్రారంభమున

శ్లో. జానకీముఖపద్మార్కం జానకీకుచభూషణం
జానకీరమణం వందే జగతాం మంగళప్రదం.
వందే వామ స్తనన్య స్తవల్లకీవాదనోత్సుకాం
వక్త్రాబ్జవాసనాలోలభృంగిసంగీతమాతృకాం.
అస్తి ప్రశస్తావనిపాలమౌళి
రత్నావళీరంజితపాదపీఠః
రేచర్లవంశాన్వయపూర్ణచంద్రో
మహాబల స్సింగయమాధవేంద్రః.
ఆసీ త్తస్య మహామాత్యః స్వామికార్యధురంధరః
పోతరాజ ఇతి ఖ్యాతో రాజనీతియుగంధరః.
మంత్రిచూడామణే స్తస్య సోదర స్యాయ్యలుప్రభోః
గారనార్య ఇతి ఖ్యాత స్తనయో నయకోవిదః.
సోఽహం సోమకళామౌళిప్రసాదా ద్గతకల్మషః
ప్రణమ్య పింగళం నామ కవిపుంగవ ముత్తమం.
ఉదాహరణరత్నాని లక్షణగ్రంథసింధుషు
సమాకృష్య సతాం భూత్యై ప్రవక్ష్యే లక్షణదీపికామ్.

అని కలదు.

'గ' ప్రతికిఁ బ్రారంభమున

"శ్లో. ప్రణమ్య విద్వజ్జనపారిజాతం
కవీంద్రవిప్రార్చితపాదపంకజమ్
విభుం ప్రభుం విశ్వసృజం మహేశమ్
సంవక్ష్యతే లక్షణదీపికేయమ్.

అస్య, గద్యపద్యప్రబంధానాం ఛందోలక్షణనియామకస్య గ్రంథ స్యాదౌ తావ త్ప్రకారః కథ్యతే." అని కలదు.

'క' ప్రతికిఁ దుదిని—

"ఇతిలక్షణదీపికాయాం ప్రబంధలక్షణం సంపూర్ణమ్" అని కలదు.

'గ' ప్రతికి తుదిని—

"ఇతిశ్రీతరణవిజితవినుతపారిజాత పోతనామాత్యసహజాత చాతుర్యధుర్య శ్రీమదయ్యలుమంత్రిశేఖరగర్భరత్నాకర రాకాసుధాకర గౌరనార్యవిరచితాయాం లక్షణదీపికాయాం మాతృకాపూజావిధానంనామ పంచమః పరిచ్ఛేదః" అని కలదు. ఇట్టిగద్య లీప్రతిలో ప్రతిపరిచ్ఛేదము తుదినిఁగూడఁ గలవు.

2. 'క' ప్రతియందు పండ్రెండు ప్రకాశములు.
   'గ' ప్రతియం దైదు పరిచ్ఛేదములు.

3. 'క' ప్రతిలో ప్రకాశములతుదినున్నగద్యములవలనఁ గవివంశాదికమునుగూర్చి తెలియకున్నను, ప్రారంభమునందలి శ్లోకములవలనఁ నవి తెలియుచున్నది.
   'గ' ప్రతిలో గ్రంథారంభమునఁ గవివంశాదికము వర్ణింపఁబడకున్నను, పరిచ్ఛేదాంతగద్యములవలన నాయంశము దృఢముగ విశదమగుచున్నది.

4. 'క' ప్రతిలో సంస్కృతసాహిత్యచ్ఛందోగ్రంథములు మాత్ర ముదాహరింపఁబడినవి.
   'గ' ప్రతిలో సంస్కృతాంధ్రచ్ఛందోగ్రంథములు రెండును నుదాహరింపఁబడినవి.

5. 'క' ప్రతిలో వర్ణోత్పత్తిమొదలుగ మాతృకాపూజనాంతముగల ఛందోలక్షణములును, ఉదాహరణాదిప్రబంధలక్షణములును వర్ణితములు.

ఆక్రమ మిట్లున్నది.

శ్లో. వర్ణానా ముద్భవః పశ్చాత్ వ్యక్తి స్సంఖ్యా తతః పరం
భూతబీజప్రచారశ్చ తతో వర్ణగ్రహావపి
అనర్హానర్హా వేధశ్చ రూక్షస్నిగ్ధవిచారణా
ప్రయోగనిర్ణయ స్తేషాం శుభాశుభఫలానిచ
గణానాం చాభిధానాని స్వరూపా ణ్యధిదేవతా
వర్ణ వేధగ్రహా స్తద్వ చ్ఛుభాశుభఫలానిచ
మిత్రామిత్రవిచారశ్చ నక్షత్రాణిచ రాశయః
మృతవేలగ్రహావస్థా మాతృకాపూజనాక్రమః
కర్తుః కారయితుశ్చైవ ప్రబంధానాం చ లక్షణం
వక్ష్యతే తత్ర సకలం మయా లక్షణవేదినా.

'గ' ప్రతిలో వర్ణోత్పత్త్యాది మాతృకాపూజనాంతలక్షణము మాత్రము వర్ణితము.

ఇట్టి ప్రతులు రెండును విషయప్రతిపాదనమునఁ గొంతసామ్యమును గొంతమార్పును గలిగియున్నవి. ఎట్లయిన రెండిటిని గూడ రచియించినయాతఁడు 'గౌరన' యనియే చెప్పనగును.

ఇఁక మానవల్లి రామకృష్ణకవి, ఎమ్. ఏ. గారు శ్రీరంగమహాత్త్వము (భైరవకవివిరచితము) పీఠికలో నిట్లు తెలిపియున్నారు. "గౌరన లక్షణదీపికలోఁ గవిగజాంకుశమునుండి నాల్గు లాంధ్రము లుదాహరించెను. పుత్త్రిలక్షణగ్రంథమునుండి యుదాహరించెనా యని సందేహము. లక్షణదీపికాప్రతులు నాయొద్దను ప్రాచ్యలిఖితపుస్తకభాండాగారమునను గలవు. .... లక్షణదీపికలలో నన్నిప్రతులలో నానాల్గు పద్యములు గలవు" అని తెలిపియున్నారు.[1] ఈవాక్యములవలన శ్రీ రామకృష్ణకవిగారియొద్ద నున్న ప్రతులును, ప్రాచ్యలిఖితపుస్తకభాండాగారమునందలి ప్రతులును 'గ' ప్రతిని బోలినవని యూహింప

1. చూ. శ్రీరంగమహాత్త్వము. పీఠిక. పుట. iv

నగును. కోరాడ రామకృష్ణయ్య, ఎమ్.ఏ. గారు, నవనాథచరిత్రము పీఠికలో పైనుదాహరించిన 'క' ప్రతిలోని "అస్తి ప్రశస్తావనిపాలమాళి" ఇత్యాదిశ్లోకములను, 'గ' ప్రతిలోని "ఇతివితరణవిజితవినుతపారిజా" తేత్యాది గద్యమునుగూడ నుదాహరించియున్నారు[2]. వా రుదాహరించిన విషయములనుబట్టి పై రెండుప్రతులను బోలిన ప్రతి వేఱొకటి వారికి లభించియుండనేమో ? కాని వా రేప్రతినుండి యాయంశముల నుదాహరించిరో తెలుపరైరి. ఏది యెట్లున్నను నీలక్షణదీపిక గౌరనతండ్రినిం గూర్చియు, పెదతండ్రినింగూర్చియు బాగుంగ దెలుపుచు గౌరనకాలమును నిర్ణయించుటకుం దగియున్నది.

లక్షణదీపికయందలి విషయవిశేషములు.

అముద్రితముగాన నిందలి విషయవిశేషములను బాఠకుల కెఱింగించుటకై కొంచె మధికముగం దెలుపుచున్నాండను.

'క' ప్రతియందుం గవి తెలుపనెంచిన లక్షణవిశేషములు వెనుకం దెలిపిన "వర్ణానాముద్భవః పశ్చాత్" ఇత్యాదిశ్లోకస్థములు.

ఇంక 'గ' ప్రతియందు

1. వర్ణగుణదోషవిచారము.
2. నాయకలక్షణము.
3. కవిలక్షణము.
4. గణసంఖ్య.
5. గణాధిదేవతలు.
6. గణజాతివిభాగము.
7. గణస్వరవివేకము.
8. గణజాతివివేకము,
9. గణశుభాశుభకత్వ్యాదివిచారము
10. గణోద్దిష్టనక్షత్రవిచారము.
11. సజీవనిర్జీవనక్షత్రస్వరూపము.
12 దగ్ధజ్వలితధూమ్రనక్షత్రములు.
13. నక్షత్రానుకూల్యము.
14. గ్రహమైత్రీప్రకారము.
15. గణకూటప్రకారము.
16 దూరకూటప్రకారము.
17. యోనికూటప్రకారము.
18 అక్షరవిచారము.
19. అక్షరజాతివివేకము.
20. అక్షరగతులు.

2. చూ. నవనాథచరిత్రము. పీఠిక. పుట. X.XII

21. విషాక్షరవివేకము.
22. రూక్షస్నిగ్ధాస్నిగ్ధవివేకము.
23. అకారాదిక్షకారాంతవర్ణ శుభాశుభవిచారము.
24. మాతృకాపూజనము.
25. మాతృకాన్యాసప్రకారము.

అను నీవిషయము లుదాహరణములతో వర్ణింపఁబడినవి.

'క' ప్రతియందుఁ జేర్కొనఁబడిన గ్రంథములు.

1. సాహిత్యచూడామణి.
2. చమత్కారచంద్రిక.
3. శారదాతిలకము.
4. ప్రపంచసారము.
5. త్రిభాష్యరత్నాకరము.
6. వాసవదత్త
7. సాహిత్యచంద్రోదయము.
8. కవికంఠపాశము.
9. సాహిత్యరత్నాకరము.
10. బృహజ్జాతకము.
11. అమరుకము.
12. సంహితాసారము.
13. నామలింగానుశాసనము.
14. కిరాతార్జునీయము.
15. న్యాయసారము.
16. నైషధము.
17. సంహితాసంగ్రహము.
18. కవిరాజగజాంకుశము.
19. ప్రబంధదీపిక.
20. రత్నమాల.

'గ' ప్రతిలో వేర్కొనఁబడిన గ్రంథములు.

1. అలంకారసంగ్రహము.
2. కవికంఠపాశము.
3. చమత్కారచంద్రిక.
4 న్యాయసారము.
5. భరతరత్నకోశము.
6. యోగరత్నాలయము.
7. కుమారసంభవము.
8. సాహిత్యరత్నాకరము.
9. సాహిత్యచంద్రోదయము.
10. రసార్ణవసుధాకరము.
11. కవిరాజగజాంకుశము.
12. సాహిత్యచూడామణి.
13. భరతసంగీతరత్నకోశము.
14. బృహజ్జాతకము.
15. అలంకారచూడామణి.
16. శాకినీసహకారము.
17. అమరుకము.
18. అలంకారసర్వస్వము.

19. సాహసాఙ్కకావ్యము.
20. కృష్ణవిజయము.
21. మంత్రమహార్ణవము.
22. మంత్రాథర్వణము.
23. త్రివిధము.
24. ఉత్తమగండచ్ఛందము
25. మనుస్మృతి.
26. ఋగ్వేదము.
27. మాఘము.
28. ఉత్తరరామచరితము.
29. కాలనిదానము.
30. మణిదర్పణము.
31. భప్పన్నము.
32. భోజరాజీయము.
33. ఫణితశాస్త్రము.
34 సంహితాసారము.
35. రత్నమాల.
36. వాసిష్ఠసంహిత.
37. సంహితాసంగ్రహము.
38 కవిగజాంకుశము.
39. నిధిప్రదీపిక.

ఆంధ్రచ్ఛందో గ్రంథములు.

1. శ్రీధరచ్ఛందము.
2. ఆంధ్రకవిగజాంకుశము.
3. గోకర్ణచ్ఛందము.
4. భీమనచ్ఛందము.
5 అథర్వణచ్ఛందము.

అనునివి.

ఇట్లీతఁడు తనలక్షణదీపికయందుఁ బేర్కొనిన గ్రంథములనుబట్టియు లక్షణనిర్మాణపాటవమునుబట్టియు నీతఁడు సాహిత్యచతురుఁడని తెలియుచునేయున్నది. ఈవిషయమును "చతురసాహిత్యలక్షణచక్రవర్తి" అను హరిశ్చంద్ర చరిత్రలోని వాక్యమును "సరససాహిత్య లక్షణవివేకముల" అను నవనాథచరిత్రలోని వాక్యమును స్థిరీకరించుచున్నవి.

గ్రంథత్రయమేకకర్తృకము.

లక్షణదీపిక, హరిశ్చంద్రచరిత్రము, నవనాథచరిత్రము అను నీమూఁటిని రచించిన గౌరన యొక్కఁడే యనుటకుఁ దగిన యుపపత్తులను జూపుచున్నాఁడను. గౌరన తాను సింగయమాధవుని మంత్రియగు పోత

నామాత్యుని తమ్ముఁడగు అయ్యలుమంత్రికుమారుఁడనని లక్షణదీపికలోఁ ప్రారంభమునఁ దెలిపియున్నాఁడు.[8] హరిశ్చంద్రచరిత్రమునను

" సింగయమాధవక్షితిపాలమణికి
మంగళమూర్తికి మంత్రియై జగతిఁ
బొగడొందు పెద్దనపోతరాజునకుఁ
దగినతమ్ముఁడు యశోధనుఁ డయ్యలన్నఁ
జెట్టఁ బట్టంగ నోచిన భాగ్యవతికిఁ
జుట్టాలసురభికి సుందరీమణికి
ఘనుఁడు వల్లభమంత్రిగంగాంబ నోరి
కనిన పోచాంబకు గారాబుసుతుఁడ
భూతనాయకపాదపూజాభిరతుఁడ
గౌతమగోత్రుండ గౌరనాహ్వయుఁడ
సరససాహిత్యలక్షణచతురుఁడ "

నని తెలిపికొనినాఁడు.

ఇటులనే నవనాథచరిత్రమున

"ఇప్పుడుగల సుకవీంద్రులలోన
సరససాహిత్యలక్షణవివేకముల
సురుచిరమధురవచోవిలాసములఁ
గుణశీలములను సద్గుణకలాపముల
నలవడ్డవాఁ డెవ్వఁడని విచారించి
సింగయమాధవక్షితిపాలమంత్రి
పుంగవుఁడై యొప్పు పోతురాజునకు
ననుజాతుఁడగు నయ్యలామాత్యమూర్తి
తనయుఁ డుత్తముఁడు గౌతమగోత్రజుండు
ప్రథమరాంబికావరప్రాప్తవిచిత్ర

8. చూ. "అస్తి ప్రశస్తావనిపాలమౌళి" ఇత్యాదిశ్లోకములు. పుట. 8.

విమలసాహిత్యప్రవీణాధికుండు
ననఘచిత్తుఁడు గౌరనాహ్వయఖ్యాతుఁ”
దన్ను రావించెనని తెలిపినాఁడు.

ఇట్లీ మూఁడిట గౌరనవంశక్రమ మొకరీతిగనే వర్ణింపఁబడుటచే నీమూఁడు కృతులను రచియించిన యాతఁ డొక్కఁడే యనుటకు సంశయ ములేదు. మఱియు ద్విపదకృతులు రెండును మల్లికార్జునున కంకితమిచ్చు టచే నీగౌరన శివభక్తి ధురంధరుఁడని విదితమే. లక్షణదీపికయందును దనశివభక్తి పారవశ్యతను నీక్రిందిరీతిని దెలిపియున్నాఁడు.

“సోఽహం సోమకళామాళి ప్రసాదా ద్గతకల్మషః”
ప్రణమ్య విద్వజ్జనపారిజాతం
కవీంద్రవిప్రార్చితపాద పంకజం
విభుం ప్రభుం విశ్వసృజం మహేశం
సంవక్ష్యతే లక్షణదీపికేయమ్”

అని యీశ్వరునకే తనకృతుల నర్పించినాఁడు.

గౌరనతండ్రి పేరు అయ్యలామాత్యుఁడే.

గౌరనతండ్రిపేరు అయ్యలుమంత్రి యగునా? కాదా? యని విమర్శకులు సంశయించు చున్నారు.

ఈసంశయమునకుఁ గారణ మేమన హరిశ్చంద్ర చరిత్రము ప్రారం భమున “తగినతమ్ముఁడు యశోధను డెల్లమంత్రి” అనియు, తుదిని ‘మతి మంతుఁ డయ్యలమంత్రి పుంగవుని’ అనియుఁ బరస్పరవిరుద్ధముగ ముద్రిత ప్రతులందుఁ బాఠము గానవచ్చుటయే. దీనిపై శ్రీ కందుకూరి వీరేశలిం గము పంతులుగారు ‘తగిన తమ్ముఁడు యశోధనుఁ డెల్లమంత్రి’ అనునది దిద్దుటకు వీలులేనిది గనుక తుదినిగూడ ‘ఎల్లనమంత్రి పుంగవుని’ అనియే యుండనోపు నని, గౌరనతండ్రిని ‘ఎల్లమంత్రి’నిగాఁ జేసినారు. దీనిపై శ్రీ కోరాడ రామకృష్ణయ్యగారు నవనాథచరిత్ర పీఠికలో హరిశ్చంద్ర ద్విపదలోని ‘తగిన తమ్ముఁడు యశోధనుఁడెల్లమంత్రి’ అనునది సంస్కరింప వీలులేనిదిగాఁ దలంచ నక్కఱలేదు. ‘తగినతమ్ముఁడు యశోధను డయ్య

లార్య'అనిగాని,తగినతమ్ముని యశోధను నయ్యలార్య అనిగాని సంస్కరించుట దుస్సాధముగాదు అని తెలిపియున్నారు[4]. పంతులుగారు కాని రామకృష్ణయ్యగారుకాని హరిశ్చంద్ర చరిత్రము తాటియాకు ప్రతులను జూడకయే యిట్లు వ్రాసినారని యూహింపవలెను.ఏమన తాటియాకు ప్రతులందెచ్చటను'ఎల్లమంత్రి'అను పాఠమే గానరాదు. విమర్శకులకు శ్రమలేకుండ పూర్వోత్తర విరోధ మిసుమంతయు లేనట్లుగ "తగినతమ్ముఁడు యశోధనుఁ డయ్యలన్న" అను పాఠమే పెక్కుప్రతులందుఁ గానవచ్చెడిని[5].

గౌరనకాలము.

గౌరనకాలనిర్ణయమునుగూర్చి విమర్శకు లందఱు తమతమ యభిప్రాయములను వెలువఱిచియున్నారు. వారిలోఁ బ్రధానముగఁ గొందఱి యభిప్రాయముల నెఱుకపఱిచి, పిదప నాయభిమతమును దెలిపెదను. గౌరనపెదతండ్రియగు పోతన సింగయమాధవునియొద్ద మంత్రిగా నుండెనని యాతఁడు రచించిన గ్రంథముల మూఁడిటను దెలిపియున్నాఁడు. సింగయమాధవుఁడు అనఁగా సింగభూపాలుని కుమారుఁడగు మాధవభూపాలుఁడు. రేచర్ల వంశమునం దట్టిసింగయమాధవు లిరువురు గలరు. ఆక్రమమిట్టిది.



4. చూ. నవనాథచరిత్రము పీఠిక. పుట. x, xi

5. చూ.పరిష ద్భాండాగారము నందలి తాళపత్ర ప్రతులు. 1348, 2886,2127, 1667 సంఖ్యలుగలవి.

ఇట్లు డీకవి పేర్కొనిన మాధవభూపాలుఁడు మొదటి సింగభూపాలునికుమారుఁడగు మాధవుఁడా? లేక రెండవ సింగభూపాలుని కుమారుఁడగు మాధవుఁడా? అనుసందేహము చిరకాలమునుండి చరిత్రపరిశోధకులను బీడించుచునేయున్నది.

మానవల్లి రామకృష్ణకవిగారు శ్రీరంగమహత్త్వము పీఠికలో రెండవసింగని కుమారుఁ డీమాధవుఁడనియు, ఈతనితాత రామాయణమునకు 'రాఘవీయ'మను వ్యాఖ్యానమును రచించినట్లు,

శ్లో॥ శాకాఖ్యే నిధివార్ధి రామశశిగే వ్యబ్దే ప్లవంగే శుభే
మాసేఽప్యాశ్వయుజే రఘూద్వహపదే యోరాఘవీయాహ్వయామ్
టీకా మర్థపటుప్రబోధఘటనామాణిక్యపుష్పాంజలిం
కృత్వా రాజతి రావుమాధవనృపో రామాయణస్య శ్రియే.

అను నీచాటుశ్లోకము చాటుచుండుటచేతను, దీనినిబట్టి క్రీ. శ. 1427 లోఁ దాతలుతటి సింగయమాధవుఁ డుండెనుగాన, మనుమని కాలమువాఁడయిన యీగౌరన 1500 ప్రాంతములో నుండెననిరి.

కాని యీచాటుశ్లోకము రెండవ సింగయకుమారుఁడగు మాధవభూపాలునిభార్య నాగాంబిక నెలకొల్పిన శ. క. ౧౩౫౧ నాఁటి నాగారము శాసనములోఁ గానవచ్చుచున్నదిగాన రామాయణమునకు రాఘవీయవ్యాఖ్యానమును రచియించిన మాధవుఁడు మనుమఁడేగాని తాతయగు మాధవుఁడు కానేరఁడు. కావునఁ బై నిర్ణయము సరిపడదు.

చిలుకూరి వీరభద్రరావుగారు తమ 'శ్రీనాథకవి'అను గ్రంథమున గౌరనకాలమునుగూర్చి యిట్లు తెలిపియున్నారు. "హరిశ్చంద్రచరిత్ర ద్విపదకావ్యముగా రచించిన గౌరనమహాకవి తనపెదతండ్రి పోతరాజు దేవరకొండ రాజ్యాధిపతియగు సింగయమాధవక్షితిపాలమణికి మంత్రిగా నుండెనని చెప్పియుండుటచేతను, సింగనమాధవభూపాలుఁడు క్రీ. శ. ౧౪౨౩ లో రామాయణమునకు వ్యాఖ్య రచియించినాఁడని వీనిభార్యయగు నాగాంబిక రాచకొండ కుత్తరమున నాగసముద్రమను

తటాకమును ద్రవ్వించి వ్రాయించిన శిలాశాసనములో నుండుటచేతను గౌరన తననవనాథచరిత్రపీఠికలో శాంతభిక్షావృత్తియతీశ్వరుని సవిశేషముగా నభివర్ణించియుండుటచేతను 1430 ప్రాంతముననున్న పోతన కుమారుఁడైన గౌరనకవి 1450 ప్రాంతమున నుండుట సత్యమునకు విరుద్ధము కాదు[6]

వీరు తెలిపిన గౌరనకాలనిర్ణయము సరిపడుచున్నది. కాని నాగారము శాసనమునందుఁ బేర్కొనఁబడిన మాధవుఁడు దేవరకొండ రాజ్యాధిపతిగాఁడు. దేవరకొండ రాజధానిగ రాజ్యమేలిన మాధవుఁడు మొదటి సింగభూపాలుని కుమారుఁడగు మాధవుఁడు. ఆతఁడు నెలకొల్పిన శాసనము శ. క. ౧౨౭౨ నాఁటిది గలదు. అం దాతఁడు దేవరకొండ కధిపతిగా నుండినట్లు తెలుపఁబడినది. ఆతఁడు రామాయణమునకు వ్యాఖ్యానమును రచియించియుండలేదు. నాగారముశాసనమునం దుదాహృతుఁడైన మాధవుఁడు రెండవ సింగభూపాలుని కుమారుఁడగు మాధవుఁడు. ఈతఁడు రామాయణవ్యాఖ్యానము రచించిన ట్లీశాసనమునఁ గలదు.

శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు తమశృంగార శ్రీనాథమున నిట్లు వ్రాసియున్నారు.

“శాంతభిక్షావృత్తియతీశ్వరుని శాసనములు కొన్ని కర్నూలు మండలమునఁ గలవు. ఆతఁడు సరిగా శ్రీనాథునికాలమువాఁడే. ఆంధ్ర కవిత్వమం దాతని కత్యాదరముండెను. ఆకాలమున నామతాధీశ్వరు లంధ్రులయియుండిరేమో ? కాని యిప్పటివారు కర్ణాటకులు. శాంతభిక్షావృత్తి తనభృత్యునకుఁ గృతియిప్పించుటయే గాక తానుగూడ గౌరన మంత్రిచే నవనాథచరిత్రమును తెనుఁగుకృతి మల్లికార్జునదేవున కంకితముగాఁ జెప్పించుకొనియెను. నవనాథచరిత్రకారుఁడు గౌరన సరిగా

6. చూ. శ్రీనాథకవి. చిలుకూరి వీరభద్రరావుగారు. పుట. ౨౬౦-౨౬౧.

శ్రీనాథునికాలమువాఁడు. ఆతఁడు సంస్కృతమున లక్షణదీపిక యను గ్రంథమును రచించెను.[7]

శ్రీ శాస్త్రిగారు దెలిపిన కాలనిర్ణయము సరిపడుచునేయున్నది. ఇంచుమించుగ శ్రీనాథుఁడుండినకాలములో నీతఁడుండెననుట యుక్తము.

శ్రీ కోరాడ రామకృష్ణయ్యగారు నవనాథచరిత్ర పీఠికలో నీతని కాలమునుగూర్చి యిట్లు ప్రసంగించియున్నారు. గౌరన తండ్రియగు అయ్యలామాత్యుఁడు, మాధవక్షితిపాలునకు మంత్రియైన పోతరాజునకుఁ దమ్ముఁడు. ఈమాధవుఁడు 15 వ శతాబ్దిని రాచకొండ రాజ్యమేలిన సర్వజ్ఞసింగనామధేయుని కొడుకనియు, నాతనియొద్ద మంత్రిగానున్న పోతరాజే గౌరనకుఁ బెదతండ్రియగుటయును, ఈతనిచే రచింపఁబడిన లక్షణదీపికయందలి "అస్తిప్రశస్తావనిపాలమౌళి" ఇత్యాదిశ్లోకములవలనఁ దెలియుచున్నదనిరి. మఱియు, "సర్వజ్ఞసింగభూపాలుఁడని పేరువడసిన రావుసింగమహీపాలు నాస్థానమునకు శ్రీనాథుఁడు పోయినట్లును, నాతఁడు మహావిద్వాంసుఁ డగుటచే నాతని మెప్పించువిషయమున నీతఁడు కొంత జంకుకలవాఁడై 'దీనారటంకాల' ఇత్యాదిపద్యమును జెప్పి రాజసభాధిదేవతయగు శారదాంబను స్తుతించెనని ప్రసిద్ధి గలదుగదా ? అట్టి సర్వజ్ఞునికొడుకగు నీసింగయమాధవనృపాలుఁడు గూడ గొప్పపండితుఁడై శాలి. శక. 1349 సంవత్సరము (క్రీ. శ. 1427) న రామాయణమునకు రాఘవీయమను నొకటీక వ్రాసెనని యాతని భార్య రచింపించిన శాసనమునందలి 'శాకాఖ్యేనిధివార్ధి' త్యాదిశ్లోకమువలన స్పష్టమగుచున్నది. ఇట్లు క్రీ. శ. 15 వ శతాబ్ది తొలిభాగమున నున్న సింగయమాధవనృపాలునియొద్ద మంత్రిగానున్న పోతరాజునకు ననుజుఁడగు గౌరన 15 వ శతాబ్దిపూర్వార్ధమున నుండెననుటకు సందేహము లేదు. మఱియు శ్రీనాథునిచే శివరాత్రిమాహాత్మ్యమును దసభృత్యుఁడగు ముమ్మడి శాంతయ్యకుఁ గృతియిప్పించిన శ్రీశైలజంగమ

7. చూ. శృంగారశ్రీనాథము. పుట. 274-275.

మఠాధీశ్వరుఁడగు శాంతభిక్షావృత్తిరాయఁడే గౌరనచే నవనాథచరిత్రమును మల్లికార్జునిపేరఁ గృతిగాఁ జెప్పించుటచే శ్రీనాథునికాలము వాఁడేయని స్పష్టంబగుచున్నది."

శ్రీమద్రామాయణమునకు రాఘవీయమను వ్యాఖ్యానమును రచియించిన మాధవనాయని తండ్రియగు సింగభూపాలుఁడు రేచర్లవంశమునందలి రెండవ సింగమనాయకుఁడు. ఈతఁడే రసార్ణవసుధాకర మను నలంకారగ్రంథమును రచించినయాతఁడు. ఈతనికి సర్వజ్ఞబిరుదము కలదనియు, నీతని యాస్థాని కేఁగినపుడు శ్రీనాథుఁడు 'దీనారటంకాల' ఇత్యాదిపద్యమును జెప్పెననియు శ్రీరామకృష్ణయ్యగారి యభిప్రాయము. అట్లీతనికి సర్వజ్ఞబిరుదము కలదనుటకుఁ దగిన యితరాధారములను వారు తెలిపియుండలేదు. వెలుగోటివారి వంశచరిత్రమున మాత్ర మీతనికి సర్వజ్ఞ బిరుద మున్నట్లు తెలుపఁబడినది. దానిని బురస్కరించుకొని కాఁబోలు రామకృష్ణయ్యగా రట్లు తెలిపియుండిరి. ఇతర విమర్శకు లందఱు నీరసార్ణవసుధాకర కర్తకు సర్వజ్ఞబిరుదము లేదని ఘంటాపథముగ ఘోషించుచున్నారు. కాని యీసింగభూపాలుని యాస్థాని నున్న బొమ్మకంటి అప్పయార్యుఁడు తాను రచించిన అమరకోశవ్యాఖ్యలోను, సింగభూపనామాంకితముగ నలంకార శాస్త్రగ్రంథమును రచించిన విశ్వేశ్వరకవి తన చమత్కారచంద్రికలోను నీరసార్ణవసుధాకర కర్తకు సర్వజ్ఞబిరుదమున్నట్లు తెలిపియున్నారు[8]. మఱియు శ్రీమానవల్లి రామకృష్ణకవిగారు 'ఆంధ్రులు రచించిన సంగీతరత్నాకర వ్యాఖ్యలు' అనువ్యాసమున నీసింగభూపతికి సర్వజ్ఞబిరుద మున్నట్లు సింగభూపాల విరచితమైన సంగీత సుధాకరమునందలి యీక్రింది శ్లోకము నుదాహరించియున్నారు.

---

8. శ్లో. విద్యాదైవత తాత తావకగురో సర్వజ్ఞచూడామణే......సంవాదికమ్.

చ. చంద్రిక.

జైవాతృకం బుధగురుం నిలయం కలానాం సర్వజ్ఞమూర్ధమణిమాశ్రితశుద్ధపక్షమ్,
శ్రీబొమ్మకంట్యుపపదాంకిత మప్పయార్యం సర్వేప్సితోషితసురంద్విజరాజ
మాహః ॥

అమరకోశవ్యాఖ్య.

"అతిగంభీరే విషయే కతిపయవేద్యే త్విహ గ్రంథే
సమ్యగ్వ్యాఖ్యాకుశలః సర్వజ్ఞః సింహ(గ?) భూప ఏవైకః[9].

రసార్ణవసుధాకర కర్తయగు సింగభూపాలుఁడే సంగీత సుధాకర కర్తయును. కవిగా రుదాహరించిన పైశ్లోక మాగ్రంథము నందుండినచో రసార్ణవసుధాకర్తకు సర్వజ్ఞబిరుదము కలదనుట కెంతమాత్రమును సంశయింపఁ బనిలేదు.

కావున నీయంశమున శ్రీరామకృష్ణయ్యగారి యభిప్రాయము సరిపడుచునే యున్నది.

ఇఁక నీ గౌరన-సింగయమాధవుల కాలనిర్ణయమునుగూర్చి శ్రీ మల్లంపల్లి సోమశేఖర శర్మగారు మల్లాది సూర్యనారాయణశాస్త్రిగారి షష్టిపూర్తిసంచికలోఁ బ్రచురించిన 'గౌరనమంత్రి-సింగయ మాధవుఁడు' అను వ్యాసమును నందలి కాలనిర్ణయమును బరికింతము. శర్మగారు శాసనపరిశోధకులలో నగ్రగణ్యులుగ నెంచఁబడువారు. వారేది ప్రసంగించినను శాసనాదిప్రమాణపురస్సరముగనే యుండును వారివాక్యములు సర్వథాప్రమాణములే గాని ప్రమాదములు గానేరవు. కాని గౌరనకాలమునుగూర్చి వారు తెలిపిన ప్రమాణములు మాత్రము సరిపడనట్లు తోఁచెడిని. శర్మగా రావ్యాసమునం దిట్లు వ్రాయుచ్చియున్నారు.

"గౌరనకాలము తెలియుటకు ముందు సింగయ మాధవునికాలము తెలియవలెను. హరిశ్చంద్ర నవనాథచరిత్రములవలన సింగయ మాధవుఁడెవఁడో స్పష్టముగఁ దెలియకపోయినను లక్షణదీపిక ననుసరించి యాతని వృత్తాంతము కొంత తెలియుచున్నది.

మ. సూ. షష్టిపూర్తి సంచిక. పుట 41.

శ్రీ వీరేశలింగము పంతులుగారు కాని శ్రీ కోరాడ రామకృష్ణయ్యగారు కాని వెలుగోటి వంశచరిత్రమును జూచియు ప్రమాదము పాల్పడినా రదియెట్లో? శ్రీ రామకృష్ణయ్యగారు సర్వజ్ఞసింగభూపతి విషయముకూడఁ దెచ్చి ఈగౌరనమంత్రి కాలసమస్యను మరింత క్లిష్టముచేసి

9. చూ. భారతి. ధాత. సం॥ కార్తికమాసము. పుట-౬౨౩.

నారు. లక్షణదీపికా శ్లోకములం దుదాహృతుఁడయిన సింగభూపతి సర్వజ్ఞ సింగభూపతియనుట కాధారము మృగ్యము. పుట. 46-47.

"శ్రీ వీరేశలింగముగా రుదాహరించిన "శ్రీమతో మాధవేంద్రస్య......"యస్యామాత్య శిఖామణేః......"శాకాఖ్యేనిధి వార్ధిరామ శశిగే......" అను శ్లోకములు శాసనములోనివే......పై నుదాహరించిన మూడుశ్లోకములలో మొదటిరెండును హైదరాబాదు సంస్థానమునందలి మహబూబునగరము జిల్లా అమరవాది తాలూకాలోఁ జేరిన శ్రీశైలోత్తరద్వారమైన ఉమామహేశ్వరము దేవస్థానసమీపమున నున్న మాదానాయని శాసనములోనివి" పుట 47.

"ఈపైవిషయముల ననుసరించి చూచినచో ఉమామహేశ్వర శాసనమునందలి మాధవుఁడు మొదటి సింగభూపతి కుమారుఁడయిన మొదటి మాదానాయకుఁడనియు, అతఁడు శకవర్షములు ౧౨౫౫ (క్రీ. శ. ౧౩౭౩ నాటివాడనియు, అతనికడనే గౌరనమంత్రి పెదతండ్రియైన పెద్దనపోతరాజు మంత్రిగా నుండెననియు, నాగారము శాసనమునందలి శకవర్షము. ౧౩౪౯ (క్రీ. శ. ౧౪౨౭) నాటి సింగయమాధవుఁడు ఉమామహేశ్వరము శాసనమునందలి సింగయమాధవునికి మనుమఁడనియు విస్పష్టమగుచున్నది. అట్లగుటంజేసి ఎవరియొద్ద పోతురాజు మంత్రిత్వము వహించెనో ఆసింగయ మాధవుఁడు శ్రీ మద్రామాయణ టీకాకారుఁడు కాఁడనియు, రూఢమగుచున్నది. పెద్దనపోతురాజు ప్రభువయిన మాధవుఁడు మొదటి సింగభూపాలుని కుమారుడని నిర్ధారితమైనందున ఈసింగభూధవుఁడు సర్వజ్ఞసింగభూపతి కాఁడనుటకు పెద్ద వితర్క మక్కఱలేదు.

హరిశ్చంద్ర నవనాథచరిత్రములందు గౌరన పేర్కొనిన సింగయమాధవుఁడు మొదటి సింగభూపతి కుమారుడయిన మాధవభూపాలుఁడగుటవలన గౌరనమంత్రికాలము ఇంక కొంచెము వెనుకకు పోవుచున్నది. అతఁడు క్రీస్తుశకము పదునాలుగవ శతాబ్ది అంతమునం దుండినట్లు నిశ్చయింపవచ్చును." పుట. 49.

శర్మగారు సింగయమాధవుని గుర్తించుటకు లక్షణదీపికను హరిశ్చంద్ర నవనాథచరిత్రలకంటె నెక్కుడు ప్రమాణముగఁ గైకొనియున్నారు. కాని ఆలక్షణదీకపియం దుదాహరించిన లక్షణగ్రంథములను బరికింపరైరి. గౌరన లక్షణదీపికయందు రెండవసింగభూపాలునిచే రచింపఁబడిన రసార్ణవసుధాకరమునుండియు, అతని యాస్థానకవీశ్వరుఁడగు విశ్వేశ్వరునిచే రచింపఁబడిన చమత్కారచంద్రికనుండియు శ్లోకము లుదాహరించినాఁడు. ఈరెండు గ్రంథముల నీతఁ డుదాహరించినపుడు వారిద్దఱకుఁ దరువాతికాలమువాఁ డని యొప్పుకొనకతప్పదుగదా? రసార్ణవసుధాకరకర్తకాలము నిదమిత్థమని నిర్ణయించుటకుఁ దగిన శాసనాద్యాధారములు లేవు. కాని యీతనితండ్రియగు అనపోతానాయని శాసనములు శకవర్షములు ౧౩౦౨ (క్రీ. శ. 1380) వఱకుఁ గానవచ్చుచున్నవి. తరువాత నీతని యాఱవపుత్త్రుఁడగు మాదానాయనిభార్య నాగాంబిక నెలకొల్పిన శాసనము శక. సం. ౧౩౪౭ (క్రీ శ. ౧౪౨౫) నాఁటిది గానవచ్చుచున్నది.[10] ఈనడుమనున్న కాల మీసింగభూపాలుని కాల మనుకొనవచ్చును. ఈతఁ డెంతకాలము రాజ్యమును బాలించెనో స్పష్టముగఁ దెలియుట కితరాధారము లేకున్నను, రసార్ణవసుధాకరము పీఠికయందలి యీక్రిందిశ్లోకమునుబట్టి దీర్ఘాయుష్కుఁడై చిరకాలము రాజ్య మేలెనని తెలియుచున్నది.

శ్లో. అథ శ్రీసింగభూపాలో దీర్ఘాయు ర్వసుధా మిమామ్
నిజాంసపీఠే నిర్వ్యాజం కురుతే సుప్రతిష్ఠితామ్.

రసా. సుధా. ౧ విలా. 27 శ్లో.

కావున నీసింగభూపాలుఁడు క్రీ. శ. 1380 మొదలుగ 1425 వఱకు రాజ్యమును బాలించెననుకొనినను బాధక ముండఁజాలదు. అట్లగుటంజేసి చమత్కారచంద్రికారచనాకాలము క్రీ. శ. 1400 లకు పైఁబడి యుండితీరవలయును. ఆగ్రంథము నుదాహరించిన యీగౌరన కాల మంతకుఁ బూర్వమున నెట్లును బోఁజాలదుగదా.

10. చూ. వెలుగోటివంశచరిత్రము. అనుబంధము.

వెలుగోటివంశచరిత్రమందు మొదటిమాధవనాయనిశాసనమున పెద్దనపోతరా జాతనికి మంత్రిగ నున్నట్లు శ్లోకము లుండుటను, 'శ్రీ శ్రీ శ్రీ పెద్దిరాజుకొడుకు పోతురాజు వ్రాలు' అను నక్షరము లుండటను బరికింపక వీరేశలింగముపంతులుగారును, రామకృష్ణయ్యగారును రెండవమాధవభూపాలునియొద్ద మంత్రిగ నున్నట్లు వ్రాయుట పొరపాటని శర్మగారియభిప్రాయము. కాని మాదానాయని ఉమామహేశ్వర శాసనమునకును, అందలి తుదిశ్లోకములకును సంబంధ మెంతమాత్రమును గానరాదు. పాఠకుల కావిషయమును దెలుపుటకై శాసనస్వరూపము నిటం జూపుచున్నాను.

మాదానాయని ఉమామహేశ్వరము శాసనము.

శ్రీ గణపతయేనమః. స్వస్తిశ్రీ మన్మహామండలేశ్వర రాయగాయగోవాళ గజదళవిభాళ భుజబలభీమ ఖడ్గనారాయణ సోమకులపరశురామ సత్యహరిశ్చంద్ర శౌచగాంగేయ అప్రతిహతప్రతాపోదయ సతత హేమాద్రిదానవిరత దాచయసింగభూపతిసుతుండైన మేదినీరూపనారాయణ సింగమాంబాగర్భపుణ్యోదయ రేచర్లవంశదుగ్ధాబ్ధిసుధాకరుండైన శ్రీమాధవదేవేంద్రుండు దేవనగదక్షిణప్రాంతమందుల స్వనామాంకిత మాధవపురమందు స్వరాజ్యోపవిష్టుండై శ్రీపర్వతోత్తరద్వారమైన మహేశ్వరదేవరమంటపము మహచ్ఛిలాసమూహానను రమ్యముగా రచియింపించి పదవాక్యప్రమాణజ్ఞులైన మాయభట్టోపాధ్యాయులను తన్నిమిత్తంబై శాసనంబు చెప్పుమని పనిచినం దదుక్తశాసనంబు.

యస్మిన్నుద్ధరతి క్షితి మ్మధురిపౌ కోలాకృతౌ సంభ్రమా
దూధ్వాంసస్య మితౌ వివేకవిధురా స్సర్వేపి ఖర్వాశయాః
సత్యస్థాః కలయంతి సత్య మవనిం పాతాళగా స్సర్వతః
పాతాళం దిగిభాశ్చ భారవిరహాః పాయాత్సవ స్సర్వదా.
పాయా దాదివరాహస్య దంష్ట్రా మధ్యగతా మహీ
పంచమీ చంద్రలగ్నస్య కలంకస్యానుకుర్వతీ. ౬

యశఃప్రతాపౌ మూర్తౌతు దేవదేవస్య శార్ఙ్గిణః
పాయాస్తాం పరమానన్దకారిణౌ శశిభాస్కరౌ. 3

హేరంబస్య ముదం కరోతు భవతాం వప్రక్రియాకౌతుకీ
యో దంతేన నిపీడ్య నిర్జరగిరిం నిక్షేప్తుకామో రుషా
బిభ్యత్సు త్రిదశేషు తద్గిరితలే చ్ఛాయాం నిరీక్ష్యాత్మన
స్తాంభిందన్ప్రతిదంతివక్త్రమనసా దేవానభీకా...

పాతువః పద్మనాభస్య శయ్యాశేషఫణీశ్వరః
చకితేవ యతోలక్ష్మీః కరో యస్య నముంచతి. ౫

పురావిరాజత్పురుహూతభూతిః
పాదారవిందా దరవిందయోనేః
వర్ణ స్తురీయో... సిద్ధసింధు
సందోహసంతానయశోవితానః. ౬

తుర్యే తత్ర తురీయ విక్రమకథాచాతుర్యధుర్యోదయో
వర్ణో దేవపదారవిందజననా ద్భాగీరథీస్పర్ధినా
పాథోవత్ప్రథితప్రభావవిధినా ప్రాప్తోభిధాం లక్షణ
శ్రేష్ఠ స్తేషు గరిష్ఠపుణ్యమహిమా శేవర్ణవంశోదధిః.

లావణ్యైకరస స్తథాపి మధురో భంగైర్విహీనః పరం
సత్వాకీర్ణ నిజాంతరోఽపి నజడాసంగో నముక్తాశ్రితః
విస్ఫూర్జత్పరరాజమండలరుచిద్వేషీ నదేవాసురై
ర్యత్నాన్మథై ర్మథితో నచాపి మునినా పీత స్సవంశాంబుధిః.

ముక్తాఫలానాం సంభూతి ర్వంశేఽస్తీతి జనశ్రుతిః
అస్మిన్వంశేతు సంభూత స్సంతాన స్సర్వకామదః

తత్రాజని జనానందీ జేతా జన్యేషు వైరిణాం
విక్రమే విజయాకారో వీరో వెన్నమహీపతిః. ౧౦

దోర్దండశాలినా యేన మండలాగ్రేణ ఖండితా
రిపుశుండాలశుండాలీ జయలక్ష్మీకచాయతే. ౧౧

తస్మా దాఖిరభూ దగణ్యమహిమా క్షోణీభృతా మగ్రణీ
శ్రీమాన్ దాచమనాయకో విజయశోసీరంధ్రితాశాంతరః
య స్యాసన్నిహ పక్షిణోఽపి రిపవో భిల్లా స్సదారాఅపి
త్యక్తాశా భువి భిక్షవో వివసనా అప్యంబరాంతాశ్రయాః
యస్యాహితానాం రహితాంబరాణాం
ప్రాప్యాంతరీక్షం పరితోంతరీక్షమ్,
తదాది నూనం భజతే నురూపం
గుణాన్వయా దంబరనామధేయమ్. ౧3
అభూ త్తస్మాదుగ్రప్రతిమరిపురాజద్విపఘటీ
చపేటీవైదగ్ధ్యప్రథితపృథుకంఠీరవరవః
కరాల క్షోణీశక్షపితవరవక్షస్థలరమా
సమా...జగతి విజయీ సింగనృపతిః ౧౪.
యస్యోద్యత్కరదానవారివిచలత్పంకే మహీమండలే
నృత్యంతీ గతిశంక నుచితగతిః కీర్తి స్సపంకం పదం
బింబే చంద్రమసో నిధాయ తరసా రోహత్పదంబ్రహ్మణా
స్తత్పంకాంకితదేహఏవ గగనే నూనం కలంకీ విధుః
పుత్ర స్తస్య నృసింహస్య భాతి సుత్రామవిక్రమః
అమిత్రౌఘతమోరాశే ర్మిత్రో మాధవనాయకః
అనుజో మనుజేంద్రస్యదనుజారాతిసంపదః
అన్నపోతమహీశస్య సన్నతారిమహీపతేః. ౧౭
నృసింహసంభవోయస్మా దసౌ మాధవనాయకః
అహితద్విరదారాతిబిరుదాంకయశోంబుధిః ౧౮
ధీరం తర్జనగర్జితోంబరగత స్త్వత్ఖడ్గధారాధర
శ్శ్యామ శ్శత్రుశిరఃకపాల కరకోత్కీర్ణరుధారాజలః
సంతుష్టాత్మమహీప్రజః ప్రతిఫలత్సూర్యాంశువిద్యున్నిభో
భూమా దర్పితవైరిణాం ।పతిదినం । పాణాంకురోద్భేదకః

ఉగ్రం సమక్షేషు రణేషు పూర్వం
తతో రమాయా రమణం రిపూణాం
ధాతార మంతే శరణాగతానాం
మన్యే త్రిమూర్తిం భువి మాధవేన్ద్రమ్. ౧౦

సత్రపమ్యమ్నబలోద్ధతో నరకజి త్సత్యానురక్త స్సదా
ధర్మైకప్రవణక్రియాపరమయాయుక్త స్సుభద్రానుజః
ఏవమ్మాధవతః పురాణపురుషా న్నాన్యో నృపో మాధవో
వైషమ్యం త్విద మస్యయ త్సకజయే యుద్ధే సహాయాయతే
భాతినారాయణోదారః ఖడ్గనారాయణో నృపః
ప్రత్యక్షమపి య స్యేద మ ప్రమాణం యశో భువి. ౧౧

నిత్యం విష్ణుపదాలంబీ ద్విజరాజః కలానిధిః
సంపూర్ణమండలో రాజా నకలంకికథోప్యసౌ. ౧౩

క్షమైకాధారభూతోఽపి బాహు ర్యస్య మహీపతేః
ఛినత్తి విమతవ్రాతశిరాంసి సతతం భువి. ౧౪

వర్ణ్యతే మహితే దానే కేన మాధవభూపతిః
యే నార్థినో నృపా భూమా కృతానృపతయోఽర్థినః
ప్రత్యర్థిగాయగోగాళ స్సోయం సమరసాత్యకిః
శ్రీశైలవింధ్యమధ్యోర్వీమండలం పరిపాలయన్.

దత్యంకార్క-శకాబ్దశాలిని శివే వర్షే నవే ఫాల్గునే
మాసే దాచయసింగభూపతిసుత శ్శ్రీమాధవో భూధవః
శ్రీశైలోత్తరతోరణే భువి మహేశస్యాలయం నూతనం
పాషాణై స్సుదృఢం సురాసురనుతం గమ్య మ్ముదాచీకరత్.

నిశ్రేణ...దభంగ రసానతలమోపాన్సపానమార్గందృఢం
శైలందిక్షుమహేశ్వరస్యచగృహం శ్రీమాధవేనాతతమ్.
ఇంద్రాద్యాఃకిల నిర్జరాభువివయం నోమాధవో నిర్మితా
దైవేనేతి వినమ్ర వక్త్రకమలా శ్చింతాం శ్రయ న్తేపరామ్.

మాధవో వర్ణ్యతే యేనదిలీప నలనాహుషైః
అకృతం సుకృతం యేన కృతాసుకృతినా కృతమ్.
పదవాక్యప్రమాణేషు ప్రవీణేన వినిర్మితమ్
శాసన మ్మాయసుధియా స్థేయా దాచంద్రతారకమ్.
శ్రీమతో మాధవేంద్రస్య రాజ్యాంగైకధురంధరః
మంత్రీ పోతనా మాపి త్సర్వశాస్త్రవిశారదః
యస్యామాత్యశిఖామణేః కవివరస్తోత్రైకపాత్రీకృతాం
మత్వా వాక్పతి ర్ధసితిసుభగాం వాగ్వైఖరీం లజ్జతే
సోయం పెద్దనమంత్రివర్యతనయః శ్రీపోతరాజోన్వహం
దేవస్యాస్య మహోపకారరచనాం సమ్యఙ్ముదాచీకరత్.

శ్రీగిరినాథాయనమః

సంత్వన్యేపి గిరౌగిరౌచ విబుధాః కక్షేషుకుక్షింభరి
క్షీబక్షీబతరక్షుభక్షణ భయత్యక్తా విరక్తాశ్రమాః
తేసర్వేనిజ...సిర్జరధుసీ నీరాక్తచంద్రాతప
స్మేరోమానయనోత్పలోత్సవ సురాధీశో మహేశోనుకిమ్
గజాసురేంద్రకుంభకూటనాటనాతిపండితం
సురాసురేంద్రమౌళిహీరరంజితాంఘ్రి పంకజమ్
కళాధరోరగాధినాథ భూషితోత్తమాంగకం
సదాభజే మనోభవారి మంబికేశ మాదరాత్.

ఈశాసనములు వ్రాయింపవచ్చి వంగూరు తిప్పయభట్లు దేవతాస్తుతిగాను జెక్కినశ్లోకాలు ఈరెంటను.

శ్రీ శ్రీ శ్రీ పెద్దిరాజుకొడుకు పోతురాజువ్రాలు.

మన్యేమాధవమంచితాంగమహితా శాశాసితోగ్రప్రభం
యత్రాయాప్రకటార్థిరాగమవిధిజ్ఞై స్సజ్జనైః కృత్స్నశః.
దత్వాసూన్యధి పత్రిణోయమరయోజానంతి సంతంజయే

యే నేంద్రమ్మహసా యమంచదళితాభం భూరిశ స్సాదయే
చక్ర బంధోయంశ్లోకః.

ఈశాసనమునం దొలుత నాంధ్రభాష నీయంశము సూక్ష్మముగఁ దెలుపఁబడినదో యాయంశమే సంస్కృతశ్లోకములందు వివరింపఁబడినది. తెలుఁగువచనమున బిరుదాంకితుఁడు దానసింగభూపతిసుతుఁడు నగు మాధవభూపాలుఁడు మాధవపురమున రాజ్యమేలుచు పై శాసనమును నిర్మింపఁబూని మాయభట్టోపాధ్యాయునిచే రచింపించె ననికలదుగదా. ఆయంశ మంతయు శాసనములోని 30 శ్లోకములలో సమగ్రముగ వర్ణించి శాసనరచయితయగు మాయభట్టోపాధ్యాయుఁ డీశాసన మాచంద్రార్కముగ స్థిరమగుఁగాకయని యాశించుచు శాసనమును ముగించినాఁడు. ఇక్కడకీ శాసనస్వరూపమంతయు పూర్తిగ ముగిసినది. ఆవెనుక నీపోతరాజుమంత్రిఁగూర్చిన శ్లోకములు, కూడవచ్చిన తిప్ప భొల్లు చెక్కించిన స్తోత్రశ్లోకములు, గోతరాజుప్రాలు, అను నక్కర ములు మాధవప్రశంసాత్మకమైన చక్రబంధశ్లోకము గానవచ్చుచున్నవి. ఇవన్నియు నీశాసనమునకు సంబంధింపని యంశములే. సాధారణముగ తామ్రశిలాశాసనములలో దేవతాస్తుతి, శాసననిర్మాతయొక్క వంశావ తారము, శాసనప్రయోజనము, స్వరూపము, శాసనమురచించునాతని పేరును వెలయుచుండును. వీనిలో నేవియుఁ గొన్ని లేకుండుటయుఁ గ్వాచిత్కముగా నుండును. కాని శాసనస్వరూపము ముగిసినపిమ్మట నాశాసనమునకు సంబంధింపని యితరవ్యక్తుల ప్రసంగ ముండఁబోదు. ముప్పదియవ శ్లోకముతరువాతివిషయమంతయు నీశాసనమునకు సంబం ధింపనిదియే.

మఱియు వెలుగోటివంశచరిత్రమునఁ జూపిన శాసనపుఁబ్రతిలో ముప్పదియవ శ్లోకముతరువాత నున్న శ్లోకములకుఁ గ్రమసంఖ్య గాన రాదు. అట్లంకెలు లేకుండుటయు నీ తరువాతి శ్లోకము లాశాసనము నకు సంబంధింపనివని సూటిగఁ దెలుపుచున్నది.

మఱియు "సీ వెలుగోటివంశచరిత్రమున నాయాభూపాలురకాల మును దెలుపుటకు వారివారి శాసనముల నెఱుకపఱుచుటయేగాక వారి పేరిపేరులతోఁ గూడిన శ్లోకములను గూడ చరిత్ర కుపయోగించుటకై సంగ్రహించి యున్నారు. ఈశాసనముతుది నున్న చక్రబంధశ్లోక మట్టిది కాఁగదా? కావుననే రెండవసింగభూపాలుఁడు నెలకొల్పిన శాసనములు లభింప నందున నాతనిచరిత్రము నెఱుకపఱుచుటకై యాతఁడు రచించిన రసార్ణవసుధాకరమునందలి శ్లోకముల నాయనుబంధమున వెలువఱిచి యున్నారు. ఇటులనే నాయాభూపాలురకు సంబంధించిన సనదులను గూడఁ జేర్చియున్నారు.

ఇఁక నిచ్చట మాధవునియొద్ద మంత్రిగా నుండిన పోతరాజును గూర్చి తెలుపు పైరెండుశ్లోకములు మాధవనామాంకితములు గాన నీశాసనమున కనుబంధముగాఁ గూర్చియుండు రని తెలియవచ్చుచున్నది. లేకున్న శాసనస్వరూప మంతయు ముగిసినపిదప నీశ్లోకము లట నుండుట కేమియు నక్కఱ గానరాదు. ఇంతకును శాసనము చెక్కఁబడిన చోటికిఁ బోయి, యచ్చటి శిలలందలి శాసనాక్షరస్వరూపమును బాగుగఁ బరిశీలించి, యథార్థమును గ్రహింపనంతవఱకు నీశ్లోకముల నూఁతగఁగొని పెద్దన పోతరాజీమాధవునియొద్ద మంత్రిగ నుండె ననుట సాహసమాత్రమే యగును.

"హరిశ్చంద్రనవనాథచరిత్రలందు గౌరన పేర్కొనిన సింగయ మాధవుఁడు మొదటిసింగభూపతి కుమారుఁ డయినమాధవభూపాలుఁ డగుటవలన గౌరనకాలము ఇంక కొంచెము వెనుకకుపోవుచున్నది" అని చెప్పుచు శర్మగారు నవనాథచరిత్రమునకుఁ గృతిభర్తయైన శాంతభిక్షావృత్తి యతీశ్వరునిఁగూర్చి యించు కైన నుపన్యసింపరైరి. ఈశాంతభిక్షావృత్తియతీశ్వరుఁడే తనభృత్యుఁ డయినముమ్మడి శాంతయ్యకు శ్రీనాథునిచే శివరాత్రిమాహాత్మ్యమును గృతిగ నిప్పించినట్లు ఆమాహాత్మ్యమునందలిపీఠికాపద్యములవలనఁ దెలియుచున్నదిగదా! మాహాత్మ్యమునందుఁ

శేరొ్కనఁబడినశాంతభిక్షావృత్తియతీశ్వరుఁడును, నవనాథచరిత్రమునందుఁ జేరొ్కనఁబడిన యాతఁడును వేర్వేఱుపురుషు లని స్వప్రమాణముగ నిరూపించుటకుఁ దగిన యాధారము దొరకనంతవఱకు నిద్దఱు పురుషు లొక్కరేయని యూహించుటకు బాధక ముండదు గదా. అట్లగుట నీశాంతభిక్షావృత్తియతీశ్వరుఁడు శ్రీనాథునికి సమకాలికుఁడై క్రీ. శ. 1440 ప్రాంతమునందున్నవాఁడగును. అతనియనుమతిని నవనాథచరిత్రమును రచించిన యీగౌరనయు నాకాలమునాఁటివాఁడే యగు ననుటకు సంశయింప నక్కఱలేదు.

కావున, గౌరన తనలక్షణదీపికలో చమత్కారచంద్రికనుండియు రసార్ణవసుధాకరమునుండియు శ్లోకముల నుదాహరించుటచేతను, నవనాథచరిత్రమును శ్రీనాథునకు సమకాలికుఁ డగుశాంతభిక్షావృత్తియతీశ్వరు నాజ్ఞచే మల్లికార్జునునకుఁ గృతినిచ్చుటచేతను, పోతరాజునుగూర్చి తెలిపినశ్లోకము లాశాసనమునకు సంబంధింపని వగుటచేతను, శర్మగారనుకొనినట్లు గౌరనకాలము కొంచెము వెనుకకుఁ బోవుటకు బదులుగా ముందునకే వచ్చును. అతఁడు క్రీస్తుశకము పదునాల్గవ శతాబ్ది అంతమందుండుట యెట్లును బొసఁగదు. కావున క్రీస్తుశకము పదునేనవశతాబ్ది పూర్వార్ధమున, అనఁగా క్రీ. శ. 1400 మొదలు 1450 వఱ కాతని కాలమయి యుండును.

శ్రీ నేలటూరు వెంకటరమణయ్య ఎమ్. ఏ. గారు 'గౌరన' అను వ్యాసమున నీతనికాలమునుగూర్చి యిట్లు తెలిపియున్నారు.

"సింగనమాధవుఁడును నతని మంత్రియగు పెద్దన పోతురాజును శా. శ. ౧౨౯౮ లో నుండిరని యుమామహేశ్వరశాసనమునందలి "దంత్యంకార్కశకాబ్దశాలిని" ఇత్యాదిశ్లోకము విదితము సేయుచున్నది. మఱియు శాసనాంతమునఁ బెద్దన పోతురాజు వ్రాలు గానవచ్చుచున్నది. "ఈశాసనము వ్రాయింపవచ్చి వంగూరితిప్పయభట్లు దేవతాస్తుతిగాను చెక్కినశ్లోకాలు ఈ రెండును శ్రీ శ్రీ శ్రీ పెద్దిరాజుకొడుకు పోతు

రాజు వ్రాలు.” ఇఁక సింగన మాధవుఁడును వరనిమంత్రియగు పెద్దన పోతురాజును క్రీ. శ. ౧౩౭౬ వ సంవత్సరప్రాంతమున నుండిరనుట నిస్సంశయముగదా. పోతిరాజాతమ్ముఁడగు నయ్యామంత్రియు నప్పటి వాఁడనుట నిశ్చయముగదా. అయ్యామంత్రికుమారుఁడును హరిశ్చంద్ర నవనాథచరిత్రలకర్తయునగు గౌరన క్రీ. శ. ౧౩౯౦, ౧౪౧౦ ల ప్రాంత మున గ్రంథరచనకుఁ గడంగెనని యూహింపవచ్చును. అతఁడు క్రీ. శ. ౧౪ వ శతాబ్దాంతమువాఁడగునుగాని వీరేశలింగముపంతులుగారు చెప్పి నట్లు ౧౫ వ శతాబ్దమధ్యకాలమువాఁడు కాఁజాలఁడు”. శ్రీ వెంకట రమణయ్యగారి యభిప్రాయమునకును శ్రీ శర్మగారి యభిప్రాయము నకును భేదమించుకయుఁ గానరాదు.

గౌరనతండ్రిని ‘అయ్యనమంత్రి’ అని పేర్కొని హరిశ్చంద్ర చరి త్రమునం దట్లు సంస్కరించియున్నారు. వీరి కీపాఠ మెట్లులభించినదో? శ ర్మగారు నవనాథచరిత్రకృతిపతియగు శాంతభిక్షావృత్తిని పేర్కొనలేదు. వీరాతనిఁ బేర్కొనియు శివరాత్రిమాహాత్మ్యమునం దుదాహృతుఁడును, నవనాథచరిత్రమునం దుదాహృతుఁడును వేర్వేఱుపురుషు లనినారు. అట్ల నుటకుఁ దగినయాధారములను మాత్రము తెలుపరైరి. శ్రీ సూర్యనా రాయణశాస్త్రిగారి షష్టిపూర్తిసంచిక వెలువడి సుమారొకవత్సరము గావచ్చుచున్నది. అందు శర్మగారు తెలిపిన యుపపత్తులనే, అం దుదా హరించిన శాసనములనే యాధారముగఁ జేసికొని వీ రిట్టికాలనిర్ణ యము ను జేయుటచూడ విచిత్రముగఁ దోఁచుచున్నవి.

శర్మగారి యభిప్రాయమును విమర్శించియుంటినిగావ ఆహేతువు లచేతనే శ్రీ వెంకటరమణయ్యగారి సిద్ధాంతమును గతార్థమగుటఁ జేసి యింతకెక్కుడు వ్రాయనక్కఱలేదని పాఠకులకుఁ దెలుపుచు నింతటితో విరమించుచున్నాఁడను.

చూ. భారతి. చిత్రభాను-శ్రావణము-పుట 96-100.